మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

శుక్రవారం 23 -10-2026
పేజీలు: 8 వెల: రూ.2/-
సంపుటి:5 సంచిక 321

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609

## మరో 30 ఏళ్లు కాంగ్రెస్‌కు అధికారం దక్కదు

- కాంగ్రెస్, రాహుల్ గాంధీపై కేంద్ర హోంమంత్రి విమర్శలు
- యమునా నది పునరుద్ధరణ పనుల కార్యక్రమంలో రాజకీయ వ్యాఖ్యలు
- బూత్ స్థాయి నుంచి ప్రధాని వరకు ప్రజలతో మమేకమవుతున్న బీజేపీ నేతలు
- ఓటు చోరీ ఆరోపణలపై రాహుల్ గాంధీ వైఖరిని తప్పుబట్టిన షా
- కోర్టుల తీర్పులపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆరోపణ
- యమునా కాలుష్యానికి గత ప్రభుత్వాలే కారణమని విమర్శ
- 2029 నాటికి యమునా నదిని ప్రక్షాళన చేయాలని లక్ష్యం
- పంజాబ్‌లో డ్రగ్స్ వ్యాపారం పెరిగిందంటూ ఆప్ ప్రభుత్వంపై ఆరోపణలు



03

## ఇన్‌స్టాగ్రామ్‌లోకి సోనియా గాంధీ

- తొలిసారిగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఖాతా తెరిచిన కాంగ్రెస్ అగ్రనేత
- తన ఆత్మకథ తొలి రూపాన్ని పరిచయం చేసిన సోనియా
- 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో పుస్తకం
- రాహుల్, ప్రియాంక ఖాతాలను వెంటనే ఫాలో అయిన సోనియా
- కాంగ్రెస్ పార్టీ ఖాతానూ అనుసరిస్తున్న పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్
- సోనియా ఖాతాను ఫాలో అవుతున్న రాహుల్‌తో పాటు సీనియర్ నేతలు
- నవంబర్ 10న పుస్తకాన్ని విడుదల చేయనున్న ప్రచురణ సంస్థ
- ప్రేమ, బాధ్యత, నష్టాలు, తనదైన గుర్తింపు ప్రయాణంపై ఆత్మకథ



03



## తెలుగు రాష్ట్రాలకు మళ్లీ వర్షాలు

- బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం
- ఏపీ, తెలంగాణలో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం
- ఆంధ్రప్రదేశ్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల హెచ్చరిక
- తెలంగాణలో ఈదురుగాలులతో కూడిన తేలికపాటి జల్లులు
- ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: అక్టోబర్ 22 డ్రీమ్స్ టైమ్స్
తెలుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముఖ్యమైన హెచ్చరిక జారీ చేసింది. బంగాళాఖాతంలో అక్టోబర్ 23న (శుక్రవారం) మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు వాతావరణ శాఖ సూచనలు జారీ చేసింది. థాయిలాండ్ గల్ఫ్, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఆవర్తనానికి అనుబంధంగా ఈ వ్యవస్థ బలపడుతోంది. ఇది ఉత్తర అండమాన్ సముద్రం వైపు కదిలి, ఆ తర్వాత పశ్చిమ-వాయువ్య దిశగా ప్రయాణించనుంది. దీని గమనం, తీవ్రతను బట్టి రెండు రాష్ట్రాలపై వాతావరణ ప్రభావం ఆధారపడి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. -మిగతా 3 లో

# ఏపీలో 'పురపోరు' నవంబరు 1న

### మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌ను సవరించిన ఎస్ఈసీ

- నవంబరు 3న ఓట్ల లెక్కింపు.. అదే రోజు ఫలితాలు
- మైదుకూరులో మొత్తం 32 వార్డులకు మళ్లీ నామినేషన్లు
- కడపలో 11, తిరుపతిలో 18 వార్డులకు కొత్తగా నామినేషన్లు
- రాజంపేటలోనూ 11 వార్డులకు నామినేషన్ల స్వీకరణ
- శుక్ర, శనివారాల్లో నామినేషన్ల దాఖలుకు అవకాశం
- 25న పరిశీలన.. మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణ
- సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో కలెక్టర్లు, ఎస్పీల నివేదికల పరిశీలన

ఆంధ్రప్రదేశ్‌లో 100 పట్టణ స్థానిక సంస్థలకు నవంబర్ 1న పోలింగ్ నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. నవంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టనుండగా, కడప, రాజంపేట, మైదుకూరు, తిరుపతిలో ఈ నెల 23, 24 తేదీల్లో నామినేషన్లు స్వీకరించనున్నారు. 25న నామినేషన్ల పరిశీలనతో పాటు అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు.

03





03

### సర్'కు వ్యతిరేకంగా

## నేడు నిరసన

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్
- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ రద్దు చేయాలని పిలుపు
- సంయుక్త కిసాన్ మోర్చా, పీపుల్ ఎగనెస్ట్ ఎస్ఐఆర్ వేదికల నిర్ణయం
- 13.41 కోట్ల మంది ఓటుహక్కు పునరుద్ధరించాలని డిమాండ్
- జిల్లా, తహసీల్ కేంద్రాల్లో ఆందోళనలకు పిలుపు
- రాష్ట్ర రాజధానుల్లోనూ నిరసన కార్యక్రమాలు
- ఢిల్లీలో ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ప్రదర్శన
- శుక్రవారం దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని విజ్ఞప్తి




03

## డ్రైవింగ్ లైసెన్స్‌కు 75 శాతం మార్కులు తప్పనిసరి!

- పాస్ మార్కులను 60 నుంచి 75 శాతానికి పెంచే ప్రతిపాదన
- సురక్షిత డ్రైవింగ్ శిక్షణకు కనీసం 30 నిమిషాలు
- కేంద్ర రహదారులు, రవాణా మంత్రిత్వశాఖ నిబంధనల్లో మార్పులు
- ఆధార్ ధ్రువీకరణతో కొన్ని ఆన్‌లైన్ సేవలకు ఫీజు మినహాయింపు
- లైసెన్స్ వివరాల మార్పులకు రుసుములు తొలగించే యోచన
- దరఖాస్తులపై 15 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని ప్రతిపాదన



03

- ప్రధాని మోదీకి ఫోన్ చేసిన బెంజమిన్ నెతన్యాహు
- ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవానికి రావాలని ఆహ్వానం
- భారత పైలట్ స్మిత్ మచ్చర్‌తో కలిసి వేడుకల్లో పాల్గొనాలని విజ్ఞప్తి
- మోదీతో కలిసి టార్చ్ వెలిగించాలని నెతన్యాహు ఆకాంక్ష
- ఫోన్ సంభాషణ వివరాలను సామాజిక మాధ్యమాల్లో వెల్లడించిన నేతలు
- ఉగ్రవాదంపై పోరులో ఇరు దేశాల భాగస్వామ్యంపై చర్చ
- భారత్--ఇజ్రాయెల్ ద్వైపాక్షిక సంబంధాలపై హర్షం
- మోదీతో భేటీకి సంబంధించిన ఫొటోను పంచుకున్న నెతన్యాహు

## ఇజ్రాయెల్ స్వాతంత్ర్య వేడుకలకుమోదీకి ఆహ్వానం

# సీఎంతో పవన్ భేటీ

- చంద్రబాబుతో అరగంట పాటు సమావేశమైన డిప్యూటీ సీఎం
- స్థానిక ఎన్నికల్లో వైసీపీ నేతల తీరుపై చర్చ
- సుప్రీంకోర్టు తీర్పుపై ఇరువురి సమాలోచనలు
- మున్సిపల్ అభ్యర్థుల తుది జాబితా నిలుపుదలపై చర్చ
- కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై ప్రస్తావన
- రిజర్వేషన్ల విషయంలో విభేదాలపై చర్చించినట్లు సమాచారం
- రాజీనామా ప్రచారంపైనా చర్చ జరిగినట్లు కథనాలు
- ఉండవల్లిలో సీఎం నివాసంలో సమావేశం



అమరావతి, అక్టోబర్ 22 డ్రీమ్స్ టైమ్స్
ముఖ్యమంత్రి చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ నేతల అరాచకాలు, సుప్రీంకోర్టు తీర్పు, మున్సిపల్ అభ్యర్థుల తుది జాబితా తాత్కాలిక నిలుపుదల తదితర అంశాలపై చర్చించారు. గురువారం ఉదయం ఉండవల్లిలోని సీఎం నివాసానికి వచ్చిన పవన్ అరగంట ఆయనతో భేటీ అయ్యారు. స్థానిక ఎన్నికల్లో కొన్ని చోట్ల కూటమి పార్టీల నడుమ సీట్ల సర్దుబాటు, సీట్ల రిజర్వేషన్లపై స్వల్ప విభేదాలు తలెత్తాయి. వాటిపై తమకు సమాచారం ఇవ్వలేదని జనసేన నేతలు సీఎం వద్దే అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే సీఎం, డిప్యూటీ సీఎం సమావేశమయ్యారు. ఎన్నికల అంశాలతోపాటు డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా చేస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంపైనా ఇద్దరూ చర్చించినట్లు సమాచారం. వాస్తవానికి స్థానిక ఎన్నికలపై సుప్రీంకోర్టు తీర్పు, రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నిర్ణయంపై కూటమి పార్టీల అగ్రనేతలు బుధవారం రాత్రే సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

### డిసెంబర్‌లో తెలంగాణకు

# ప్రధాని మోదీ!

### వరంగల్ కేంద్రంగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

- రైల్వే తయారీ కేంద్రం, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అంకితానికి ఏర్పాట్లు
- నవంబర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటనకు అవకాశం
- హైదరాబాద్‌లో రాష్ట్ర బీజేపీ ముఖ్యనేతల సమావేశం
- నవంబర్ 1న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ
- సమావేశానికి అధ్యక్షత వహించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు
- కిషన్‌రెడ్డి, డీకే అరుణ, ఈటల రాజేందర్ సహా ముఖ్యనేతల హాజరు
- ప్రజాస్వామ్య పరిరక్షణ నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని పిలుపు



హైదరాబాద్: అక్టోబర్ 22 డ్రీమ్స్ టైమ్స్
తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన డిసెంబర్‌లో ఉండే అవకాశముందని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. వరంగల్‌లోని రైల్వే తయారీ కేంద్రం, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను జాతికి అంకితం చేసే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సమాచారం. అంతకుముందు నవంబర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్రంలో పర్యటించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే ఈ పర్యటనల తేదీలు, కార్యక్రమాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. -మిగతా 3 లో

# రిజిస్టర్డ్ సిమ్ ఉంటేనే ఇక వాట్సాప్!

**జనవరి 1 నుంచి కొత్త నిబంధనలు**



**న్యూఢిల్లీ: అక్టోబర్ 22 డ్రీమ్స్ టైమ్స్**

మొబైల్ సిమ్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న కొత్త నిబంధనలు త్వరలో వాట్సాప్, టెలిగ్రామ్ వంటి ప్రముఖ మెసేజింగ్ సేవల వినియోగదారులపై ప్రభావం చూపనున్నాయి. నిబంధనల పరిధిలోకి వచ్చే యాప్ ఆధారిత కమ్యూనికేషన్ సేవలు తమ ఖాతాలను కేవైసీ ధృవీకరించిన సిమ్ కార్డులతో అనుసంధానించాలని టెలికమ్యూనికేషన్స్ శాఖ(డీవోటీ) ఆదేశించింది. ఈ నిబంధనలను పాటించడానికి ఈ ఏడాది డిసెంబర్ 31ను గడువు తేదీగా నిర్ణయించింది.రిజిస్టర్డ్ సిమ్ కార్డ్ లేకుండా వైఫై ద్వారా వాట్సాప్ లేదా టెలిగ్రామ్‌ను ఉపయోగించే స్మార్ట్‌ఫోన్లపై ఈ కొత్త నిబంధనలు ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇందులో ఐఫోన్లు, ఆండ్రాయిడ్ పరికరాలు రెండూ ఉంటాయి. ఈ సేవలు నిబంధనలను ఎలా అమలు చేస్తాయనే దానిపై ఆధారపడి ఉంటాయి. ఐఫోన్‌లో సిమ్ కార్డ్‌లేని విషయాన్ని గుర్తించిన యాపిల్ సిమ్ బైండింగ్‌కు మద్దతు ఇచ్చేలా ఇప్పటికే సెప్టెంబర్‌లో విడుదల చేసిన సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ద్వారా ఐవోఎస్‌ను అప్‌డేట్ చేసింది. తమ మెసేజింగ్ ఖాతాలను బహుళ పరికరాలలో ఉపయోగించేవారు ఈ కొత్త నిబంధనలు వారి సెటప్‌ను ఎలా ప్రభావితం చేస్తాయో తనిఖీ చేసుకోవలసి ఉంటుంది. జనవరి 1, 2027 నుంచి ఈ కొత్త నిబంధనలు అమలవుతాయి.

# భర్త కౌగిలి.. విరిగిన భార్య ఎముకలు



**న్యూఢిల్లీ:అక్టోబర్ 22 డ్రీమ్స్ టైమ్స్**

చైనాలోని జియాంగ్సు ప్రావిన్స్‌లో ఒక వ్యక్తి తన భార్యను ప్రేమతో కౌగిలించుకున్నప్పటికీ ఆమె పక్కటెముకలు విరిగి దవాఖాన పాలయ్యింది. భార్య తనకు చలిగా ఉందని చెప్పడంతో భర్త వాంగ్ ఆమెను గట్టిగా కౌగిలించుకుని ఉపశమనం కలిగించాడు. కొంత సేపటికి ఆమెకు ఛాతిలో తీవ్రంగా నొప్పి రావడంతో దవాఖానకు వెళ్లగా పరీక్షించిన వైద్యులు ఆమె ఐదు పక్కటెముకలు విరిగాయని, ఒకటి పగులు తీసిందని చెప్పారు.

# 5,000 ఉద్యోగాలను తొలగించనున్న బార్క్లేస్




**ముంబై అక్టోబర్ 22 డ్రీమ్స్ టైమ్స్**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను ఉపయోగించి స్థిర వ్యయాలను తగ్గించుకునేందుకు, రాబడులను మెరుగుపరుచుకునేందుకు బ్రిటిష్ బహుళ జాతి బ్యాంకింగ్, ఆర్థిక సేవల సంస్థ బార్క్లేస్ ఈ ఏడాది తన ఉద్యోగుల్లో 5 శాతం మందిని తొలగించాలని యోచిస్తున్నట్లు తెలిపింది. బ్యాంకు ప్రకటించిన 5,000 ఉద్యోగాల కోతల్లో ఇప్పటికే దాదాపు 1,000 ఉద్యోగాలను తొలగించారు

# టిబెట్‌లో భారీ భూకంపం

**బీజింగ్ అక్టోబర్ 22 డ్రీమ్స్ టైమ్స్**



చైనాలోని టిబెట్‌లో గురువారం రాత్రి భారీ భూకంపం సంభవించింది. జర్మన్ రిసెర్చ్ సెంటర్ ఫర్ జియో సైన్సెస్ తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి 10.33 గంటల సమయంలో ఈ భూకంపం సంభవించగా రిక్టర్ స్కేలుపై తీవ్రత 7.0గా నమోదైంది. ఉత్తర టిబెట్‌లోని నాగ్చు ప్రాంతంలో అత్యధిక ఎత్తులో ఉన్న ఒక కౌంటీలో భూమికి 10కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రం నమోదైంది.

# యూరప్‌లో నిలిచిన వెబ్‌సైట్లు!

**పీహెచ్‌పీ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లో లోపాన్ని గుర్తించిన ఏఐ**
**చర్యలు చేపట్టిన ఆయా దేశాలు**

**న్యూఢిల్లీ: అక్టోబర్ 22 డ్రీమ్స్ టైమ్స్**

ఇంటర్నెట్‌లో ఎక్కువ భాగం ఉపయోగించే పీహెచ్‌పీ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లో రెండు తీవ్రమైన భద్రతా లోపాలు బయటపడటంతో ఐరోపాలోని ప్రభుత్వ సంస్థలు బుధవారం తమ వెబ్‌సైట్‌లను తాత్కాలికంగా మూసివేశాయి. గతంలో గుర్తించిన రెండు తీవ్రమైన లోపాలను సరిచేస్తూ కొత్త అప్‌డేట్‌లను అందుబాటులోకి తెచ్చినట్టు పీహెచ్‌పీ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ డెవలపర్లు తెలిపారు. అలాగే మునుపటి లోపాన్ని పరిష్కరించడంలో ఆలస్యం జరిగినట్టు అంగీకరించారు.ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్న సంస్థలు వెంటనే అప్‌డేట్‌లను ఇన్‌స్టాల్ చేయాలని లేదా ప్రభావిత సిస్టమ్‌లను ఆఫ్‌లైన్ చేయాలని యూఎస్ నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ విజ్ఞప్తి చేసింది. ఈ లోపాల వల్ల హ్యాకర్లు నేరుగా సర్వర్ ఫైల్ సిస్టమ్ లేదా డాటాబేస్‌ను యాక్సెస్ చేసే ప్రమాదం ఉన్నదని హెచ్చరించింది. ఈ లోపాలను 'నిర్మాణాత్మక వైఫల్యం'గా పీహెచ్‌పీ ఫౌండేషన్ అభివర్ణించింది. తగిన పరిస్థితులు ఉంటే.. ప్రమాదకరమైన వ్యక్తులు




సర్వర్‌లలో తమ కోడ్‌ను రన్ చేసేందుకు ఈ రెండు లోపాలు ఆస్కారం ఇస్తాయని పేర్కొన్నది.

**ఈ లోపాలను ఎలా గుర్తించారు?**

ఒక సెక్యూరిటీ పరిశోధకుడు 2024లోనే ఈ లోపానికి సంబంధించిన సంకేతాలను గుర్తించారు. అయితే అది కేవలం సిద్ధాంతపరంగానే ఉన్నదని, స్పష్టమైన ప్రభావం చూపించే ఇతర సమస్యల కారణంగా దీనిపై ఎక్కువ దృష్టి పెట్టలేదని తెలిపారు. తర్వాత పీహెచ్‌పీ ఫౌండేషన్ తమ ప్రాజెక్ట్‌ను 'ప్యాచ్ ది ప్లానెట్' ప్రోగ్రామ్‌లో చేర్చింది. ఇందులో భాగంగా కాలిఫ్ అనే సెక్యూరిటీ సంస్థ ఈ ఏడాది జూలై 30న పీహెచ్‌పీపై ఆడిట్ ప్రారంభించింది. ఆగస్టులో కాలిఫ్, చాట్‌జీపీటీని రూపొందించిన ఓపెన్ ఏఐ సంస్థలు ఒకే రోజున స్వతంత్రంగా ఈ లోపాలను నివేదించాయి. ఆ తర్వాత గూగుల్ ఆధ్వర్యంలోని క్లౌడ్ సెక్యూరిటీ సంస్థ విజ్ కూడా ఈ లోపాలను దుర్వినియోగం చేసే మరిన్ని మార్గాలను గుర్తించింది. ఈ లోపాల వివరాలను పీహెచ్‌పీ డెవలపర్లకు రహస్యంగా తెలియజేసి సవరణలు సిద్ధమయ్యేవరకు గుప్తంగా ఉంచారు.

**వెబ్‌సైట్‌ల నిలిపివేత**

ఫ్రాన్స్‌లో పారిస్ పోలీస్ ప్రిఫెక్చర్ సహా పలు స్థానిక ప్రభుత్వ వెబ్‌సైట్‌లను ఫ్రెంచ్ నేషనల్ సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ సూచనల మేరకు బుధవారం మధ్యాహ్నం నుంచి నిలిపివేసినట్టు అంతర్గత వ్యవహారాల శాఖ తెలిపింది. నెదర్లాండ్స్‌లో అధికారులు ముందస్తు జాగ్రత్తగా డిజిటల్ ఐడెంటిటీ సర్వీస్, హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ వెబ్‌సైట్, నేషనల్ సైబర్ సెక్యూరిటీ సెంటర్ సైట్‌లను తాత్కాలికంగా మూసివేసినట్టు డచ్ బ్రాడ్‌కాస్టర్ ఎన్‌వోఎస్ నివేమంత్రిత్వశాఖ ముందస్తు జాగ్రత్తగా తమ వెబ్‌సైట్‌లను ఆఫ్‌లైన్ చేసింది.

# హెచ్‌డీఎఫ్‌సీలో డాటా చోరీ




**న్యూఢిల్లీ: అక్టోబర్ 22 డ్రీమ్స్ టైమ్స్**

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఇద్దరు ఉన్నతాధికారులు గోప్యమైన సమాచారాన్ని బయటి వ్యక్తులకు వెల్లడించినట్టు తేలిందని బ్లూమ్‌బర్గ్ న్యూస్ బుధవారం తెలిపింది. ఈ విషయంపై అంతర్గత సమీక్ష జరుగుతున్నదని సంబంధిత వాస్తవాలన్నింటినీ సేకరించి పరిశీలిస్తున్నామని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధి తెలిపారు. బ్యాంక్‌లోని రెండు కీలక విభాగాలను పర్యవేక్షించే ఇద్దరు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు బ్యాంక్‌కు సంబంధించిన అత్యంత గోప్యమైన వ్యాపార ప్రణాళికలను, మార్కెట్‌పై ప్రభావం చూపే సమాచారాన్ని బయటి వ్యక్తులకు చేరవేసినట్టు ఆధారాలు లభించాయి.గ

# గర్భిణిపై గ్యాంగ్ రేప్.. దాడి సమయంలో ప్రసవం

**జైపూర్:అక్టోబర్ 22 డ్రీమ్స్ టైమ్స్**



బీజేపీ పాలిత రాజస్థాన్‌లో గర్భవతి అయిన 16 ఏండ్ల బాలికపై కారులో ముగ్గురు వ్యక్తులు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆ దాడి సమయంలో ఆ బాలికకు ప్రసవం అయ్యి బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో వారు ఆమెను పసికందుతో పాటు రోడ్డుపై పడేసి పరారయ్యారు. హృదయవిదారకమైన ఈ ఘటన ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేకు సమీపంలోని కోల్వా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితురాలిని నిందితులు ముగ్గురు అపహరించి ఈ దారుణానికి పాల్పడ్డారు.

# కేవలం పెండ్లి కోసం మత మార్పిడులను అంగీకరించలేం

**బాంబే హైకోర్టు**



**ముంబై, అక్టోబర్ 22 డ్రీమ్స్ టైమ్స్**

: కేవలం వివాహం కోసం మతమార్పిడిని అంగీకరించలేమని పే ర్కొన్న బాంబే హైకోర్టు.. మతం మార్చుకునే వ్యక్తిగత స్వేచ్ఛను మాత్రం ధ్రువీకరిస్తున్నట్టు స్పష్టం చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన మత మార్పిడి వ్యతిరేక చట్టం రా జ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది.థాణెకు చెందిన 70 ఏండ్ల ఇస్లామ్ మత బోధకుడు దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో రాజ్యాంగంలో ని 25వ అధికరణం మతాన్ని ప్రచారం చేసుకునే స్వేచ్ఛకు హామీనిస్తుందని, అయితే ప్రభు త్వం తెచ్చిన చట్టం ఈ స్వేచ్ఛకు విఘాతం క లిగిస్తున్నదని పేర్కొన్నారు. పిటిషన్‌ను విచారించిన చీఫ్ జస్టిస్ మహేశ్ సీ త్రిపాఠి, జస్టిస్ అద్వైత్ సేథ్నాలతో కూడిన ధర్మాసనం.. స మాజంలోని లౌకిక స్వభావాన్ని కాపాడటాని కి, బలవంతంగా జరిగే మత మార్పిడుల స మస్యలను పరిష్కరించడానికి ఈ చట్టాన్ని ఉ ద్దేశించినట్టు పేర్కొన్నది. 'దేశంలోని లౌకిక స మాజాన్ని కాపాడటానికి మాత్రమే దీనిని ఉద్దేశించారు. దేశంలోని ప్రతి పౌరుడికీ తన మతం నుంచి మారే హక్కు ఉంది. కేవలం వివా హం చేసుకునే ఉద్దేశంతోనే మతం మార్చుకోవడాన్ని అనుమతించం' అని ధర్మాసనం పే ర్కొంది. ముఖ్యంగా పెండ్లికి ఒకటి రెండు రోజు ల ముందు మతాన్ని మార్చుకునే విధానాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. నిర్దిష్ట వాస్తవ వా దనలు లేనందున పిటిషన్‌ను స్వీకరించడాని కి కోర్టు నిరాకరించింది. తగిన సహాయక వా స్తవాలతో కొత్త వాదనను దాఖలు చేయడాని కి పిటిషనర్‌కు స్వేచ్ఛను మంజూరు చేసింది. దీంతో కేసును ఉపసంహరించుకోవడానికి అంగీకరించిన పిటిషనర్ త్వరలో తాజా పిటిషన్‌ను దాఖలు చేస్తానని కోర్టుకు తెలిపారు.

# మెటాకు 2 లక్షల కోట్ల జరిమానా

**న్యూ మెక్సికో:అక్టోబర్ 22 డ్రీమ్స్ టైమ్స్**

వినియోగదారుల డాటా గోప్యత విషయంలో ప్రజలను తప్పుదారి పట్టించిందన్న కేసులో ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా ప్లాట్‌ఫామ్స్‌పై అమెరికాలోని న్యూ మెక్సికో న్యాయస్థానం తీవ్ర స్థాయిలో మండిపడింది. సంస్థకు 25 బిలియన్ డాలర్లు(దాదాపు రూ. 2 లక్షల కోట్లు) రికార్డు స్థాయి జరిమానా విధిస్తూ జడ్జి ఫ్రాన్సిస్ మాథ్యూ ఆదేశాలు జారీ చేశారు. 2016 నాటి అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో బ్రిటిష్ రాజకీయ కన్సల్టింగ్ సంస్థ 'కేంబ్రిడ్జ్ అనలిటికా' సమారు 8.7 కోట్ల మంది ఫేస్‌బుక్ వినియోగదారుల వివరాలను సేకరించిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. వినియోగదారుల సమాచారాన్ని ఎవరెవరు యాక్సెస్ చేయవచ్చనే వాస్తవాలను దాచిపెట్టి, ప్రజలను 'మెటా' తప్పుదోవ పట్టిస్తున్నదని ఆరోపిస్తూ న్యూ మెక్సికో అటార్నీ జనరల్ 2021లో ఈ దావా వేశారు. గత




సెప్టెంబర్‌లో ఈ కేసును విచారించిన న్యాయ నిర్ణేతల బృందం 'మెటా' యాజమాన్యం డాటా ప్రైవసీ, భద్రత తదితర అంశాలపై చేసిన 29 బహిరంగ ప్రకటనల్లో 26 ప్రకటనలు పచ్చి అబద్ధాలని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని నిర్ధారించింది. న్యూ మెక్సికో వినియోగదారుల పరిరక్షణ చట్టాల పరిధిలో 'మెటా' దాదాపు 4.3 కోట్లకు పైగా ఉల్లంఘనలకు పాల్పడిందని జ్యూరీ తేల్చింది. మెక్సికో చట్టాల ప్రకారం మెటాకు 219 బిలియన్ల డాలర్లకు పైగా జరిమానా విధించే అవకాశం ఉన్నప్పటికీ, న్యాయమూర్తి ఆ మొత్తాన్ని 25 బిలియన్ డాలర్లకు పరిమితం చేశారు. దాదాపు 2 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువ కలిగిన మెటాకు ఈ జరిమానా తాత్కాలికంగా పెద్ద భారం కానున్నదని విశ్లేషకులు అంటున్నారు. అలాగే కంపెనీ సుదీర్ఘ అప్పీల్ ప్రక్రియను కొనసాగించే అవకాశం ఉందని కూడా భావిస్తున్నారు.

# టెస్లా, స్పేస్‌ఎక్స్ మెగా విలీనం

**న్యూయార్క్, అక్టోబర్ 22 డ్రీమ్స్ టైమ్స్**

ప్రపంచంలో అతిపెద్ద విలీనానికి ముహూర్తం ఖరారైంది. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా, స్పేస్ ఎక్స్ రెండు సంస్థలు విలీనం కాబోతున్నాయి. ఈ రెండు సంస్థలు విలీనమైన తర్వాత ఏర్పడే కొత్త సంస్థ నికర విలువ 3.5 ట్రిలియన్ డాలర్ల స్థాయిలో ఉంటుందని అంచనా.ఈ రెండు కంపెనీలు చిప్ సెట్లు, ఏఐ, ఇతర సాంకేతిక ప్రాజెక్టులను పనిచేస్తున్నాయి. విలీనం తర్వాత మస్క్ సంపద మరో 110 బిలియన్ డాలర్లు మేర పెరుగనున్నది. ప్రస్తుతం టెస్లా..ఎలక్ట్రిక్ కార్లను విక్రయిస్తుండగా, స్పేస్‌ఎక్స్‌కు చెందిన రాకెట్లు, డాటా సెంటర్లు, శాటిలైట్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నది.



# మరో 30 ఏళ్లు కాంగ్రెస్‌కు అధికారం దక్కదు

**-కాంగ్రెస్, రాహుల్ గాంధీపై కేంద్ర హోంమంత్రి విమర్శలు**
**-యమునా నది పునరుద్ధరణ పనుల కార్యక్రమంలో రాజకీయ వ్యాఖ్యలు**
**-బూత్ స్థాయి నుంచి ప్రధాని వరకు ప్రజలతో మమేకమవుతున్న బీజేపీ నేతలు**
**-ఓటు చోరీ ఆరోపణలపై రాహుల్ గాంధీ వైఖరిని తప్పుబట్టిన షా**
**-కోర్టుల తీర్పులపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆరోపణ**
**-యమునా కాలుష్యానికి గత ప్రభుత్వాలే కారణమని విమర్శ**
**-2029 నాటికి యమునా నదిని ప్రక్షాళన చేయాలని లక్ష్యం**
**-పంజాబ్‌లో డ్రగ్స్ వ్యాపారం పెరిగిందంటూ ఆప్ ప్రభుత్వంపై ఆరోపణలు**



న్యూఢిల్లీ
కాంగ్రెస్ పార్టీకి రాబోయే 30 ఏళ్లలోనూ దేశంలో అధికారం దక్కదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించారు. గురువారం ఢిల్లీలో యమునా నది పునరుద్ధరణ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా దేశ రాజకీయాలు, ప్రతిపక్షాల వైఖరిపై తన అభిప్రాయాలను వెల్లడించారు. బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వరకు పార్టీ నేతలంతా ప్రజలతో మమేకమై ఉంటారని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తారని అమిత్ షా అన్నారు. ఓటు చోరీ ఆరోపణలతో రాహుల్ గాంధీ, ఆయన అనుచరులు అక్రమ వలసదారులకు మద్దతు ఇస్తున్నారని, వారి ఓటు హక్కును కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని దేశ ప్రజలు అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికే పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ తన ఉనికిని కోల్పోయిందని అమిత్ షా వ్యాఖ్యానించారు. కోర్టులు అనుకూలంగా తీర్పులు ఇస్తే న్యాయవ్యవస్థను ప్రశంసిస్తూ, ప్రతికూల తీర్పులు వస్తే ప్రశ్నించడం కాంగ్రెస్ వైఖరిగా ఉందని విమర్శించారు. ఇలాంటి ద్వంద్వ ప్రమాణాలతో ఢిల్లీ ప్రజల అభిప్రాయాలను మార్చలేరని అన్నారు  యమునా నది కాలుష్యంపై మాట్లాడుతూ, గతంలో ఢిల్లీలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వాలు వ్యర్థాలను నదిలోకి వదిలాయని ఆరోపించారు. హరియాణా, ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చే కాలుష్య వ్యర్థాలు, మురుగునీరు కూడా నదిలో కలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఢిల్లీ, హరియాణా, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. 2029 నాటికి యమునా నదిని శుద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ పాలనలో మాదకద్రవ్యాల వ్యాపారం విస్తరించిందని అమిత్ షా ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీల పాలన, విధానాలపై విమర్శలు చేస్తూనే యమునా నది పునరుద్ధరణకు తమ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఆయన ప్రస్తావించారు. కాంగ్రెస్, ఆప్ ప్రభుత్వాలపై చేసిన ఈ వ్యాఖ్యలు అమిత్ షా రాజకీయ విమర్శల్లో భాగంగా వెలువడ్డాయి.

## ఇన్‌స్టాగ్రామ్‌లోకి సోనియా గాంధీ..



న్యూఢిల్లీ
కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ(రాశీఅఋ +ఋఅఎష్ట్రఱ) ఇన్‌స్టాగ్రామ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. గురువారం ఆమె సోషల్ మీడియా అకౌంట్ ఓపెన్ చేసి కొన్ని ఫోటోలు పోస్టు చేశారు. తన ఆత్మకథ బుక్‌కు చెందిన ఫస్ట్ లుక్‌ను ఆమె ఆ ఫోటోల్లో రిలీజ్ చేశారు. చాన్నాళ్ల తర్వాత ఆమె సోషల్ మీడియాలో మళ్లీ ప్రత్యక్షం అయ్యారు. ఇన్‌స్టా అకౌంట్ ఓపెన్ చేసిన తర్వాత.. వెంటనే ఆమె రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ అకౌంట్లను ఫాలో అయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌స్టా అకౌంట్‌ను కూడా ఆమె ఫాలో అవుతున్నారు. రాహుల్ గాంధీతో పాటు ఇతర సీనియర్ కాంగ్రెస్ నేతలు అందరూ సోనియా ఇన్‌స్టా అకౌంట్‌ను ఫాలో అవుతున్నారు. సోనియాపై సీనియర్ నేతలు ప్రశంసలు కురిపించారు. బిలాంగింగ్.. ఏ జర్నీ ఆఫ్ లవ్ ఆత్మకథ బుక్ కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు.

## తెలుగు రాష్ట్రాలకు మళ్లీ వర్షాలు

(మొదటి తరువాయి)



ఆంధ్రప్రదేశ్‌లో వర్ష హెచ్చరిక

ఆంధ్రప్రదేశ్‌పై ఈ అల్పపీడన ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. నేడు, రేపు (22, 23 తేదీల్లో) కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు వీస్తాయని ఐఎండీ అమరావతి కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు తదుపరి సూచనలు అందే వరకు వేటకు వెళ్లవద్దని సూచించింది.

తెలంగాణలో తేలికపాటి జల్లులు

ఇక తెలంగాణలోనూ పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. అల్పపీడనం బలపడే కొద్దీ ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షాల సమయంలో ప్రజలు చెట్ల కింద నిలబడటం వంటివి చేయరాదని, ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు కోత కోసిన పంటలను కాపాడుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎప్పటికప్పుడు స్థానిక వాతావరణ సమాచారాన్ని అనుసరించాలని అధికారులు కోరుతున్నారు.

# ఏపీలో 'పురపోరు' నవంబరు 1న

**-నవంబరు 3న ఓట్ల లెక్కింపు.. అదే రోజు ఫలితాలు**
**-మైదుకూరులో మొత్తం 32 వార్డులకు మళ్లీ నామినేషన్లు**
**-కడపలో 11, తిరుపతిలో 18 వార్డులకు కొత్తగా నామినేషన్లు**
**-రాజంపేటలోనూ 11 వార్డులకు నామినేషన్ల స్వీకరణ**
**-శుక్ర, శనివారాల్లో నామినేషన్ల దాఖలుకు అవకాశం**
**-25న పరిశీలన.. మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణ**
**-సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో కలెక్టర్లు, ఎస్పీల నివేదికల పరిశీలన**

**అమరావతి,**
ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) సవరించింది. ముందుగా ఈ నెల 28న జరగాల్సిన పోలింగ్‌ను నవంబరు 1వ తేదీకి వాయిదా వేసింది. నవంబరు 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని 13 నగరపాలక సంస్థలు, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. మైదుకూరు మున్సిపాలిటీలో మొత్తం 32 వార్డులకు మళ్లీ నామినేషన్లు స్వీకరించాలని ఎస్‌ఈసీ నిర్ణయించింది. కడప నగరపాలక సంస్థలో 11, తిరుపతిలో 18, రాజంపేట మున్సిపాలిటీలో 11 వార్డులకు కొత్తగా నామినేషన్లు తీసుకోనున్నారు. ఈ నాలుగు పట్టణ స్థానిక సంస్థల్లో శుక్ర, శనివారాల్లో



నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. ఈ నెల 25న ఉదయం నామినేషన్ల పరిశీలన చేపడతారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు గడువు ఉంటుంది. అనంతరం మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థల్లో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. వైసీపీ 19 మున్సిపాలిటీల్లో తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వలేదంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఫిర్యాదులపై మరోసారి పరిశీలన జరిపి తుది నిర్ణయం తీసుకోవాలని, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబరు 25 వరకు నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఎస్‌ఈసీని ఆదేశించింది. దీంతో ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు, న్యాయనిపుణులతో రెండు రోజుల పాటు చర్చలు జరిపింది. సంబంధిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల నుంచి నివేదికలు తెప్పించుకుని పునఃపరిశీలించింది. మైదుకూరు, కడప, రాజంపేట, తిరుపతి మినహా ఇతర ప్రాంతాల్లో నామినేషన్ల ప్రక్రియకు ఆటంకం కలిగినట్లు ఆధారాలు లేవని ఎస్‌ఈసీ నిర్ధారించినట్లు సమాచారం. నవంబరు 1న పోలింగ్ నిర్వహించి, అవసరమైతే మరుసటి రోజు రీపోలింగ్ చేపట్టనున్నారు. నవంబరు 3న ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలు ప్రకటిస్తారు. ఎన్నికల షెడ్యూల్ సవరణకు సంబంధించిన వివరాలను ఈ నెల 27న సుప్రీంకోర్టుకు నివేదించాలని ఎస్‌ఈసీ నిర్ణయించింది.

**మళ్లీ నామినేషన్లు స్వీకరించే వార్డులు**
మైదుకూరు మున్సిపాలిటీ: మొత్తం 32 వార్డులు
కడప నగరపాలక సంస్థ: 6, 11, 13, 15, 16, 17, 24, 31, 34, 52, 55వ వార్డులు
రాజంపేట మున్సిపాలిటీ: 6, 12, 13, 14, 17, 19, 23, 24, 25, 26, 27వ వార్డులు
తిరుపతి నగరపాలక సంస్థ: 1, 2, 3, 4, 5, 6, 9, 11, 12, 13, 14, 19, 55, 56, 57, 59, 65, 66వ వార్డులు

## ఇజ్రాయెల్ స్వాతంత్ర్య వేడుకలకు మోదీకి ఆహ్వానం



న్యూఢిల్లీ:
భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఫోన్ చేసి, తమ దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు వ ే జ ర ం కా వా ల ని ఆహ్వానించారు. ఇటీవల విమానంలో చోటుచేసుకున్న ఘటనలో ఇజ్రాయెల్ పౌరులను కాపాడేందుకు కీలక పాత్ర పోషించిన భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్‌తో కలిసి వేడుకల్లో పాల్గొనాలని, టార్చ్ వెలిగించాలని కోరారు. ఈ విషయాన్ని నెతన్యాహు సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు.  ఈ ఆహ్వానంపై ప్రధాని మోదీ స్పందించారు. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆహ్వానించినందుకు నెతన్యాహుకు ధన్యవాదాలు తెలిపారు. ఫోన్ సంభాషణలో తాజా పరిణామాలతో పాటు ఇరు దేశాల మధ్య సంబంధాలకు సంబంధించిన అంశాలపై చర్చించినట్లు వెల్లడించారు. నెతన్యాహు తన పోస్టులో మోదీని స్నేహితుడిగా పేర్కొంటూ, భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్‌తో కలిసి వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానించినట్లు తెలిపారు. భారత్, ఇజ్రాయెల్ రెండు దేశాలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మోదీతో ఉన్న ఫొటోను కూడా పంచుకున్నారు. ఇటీవల విమానంలో చోటుచేసుకున్న ఘటనలో ధైర్యంగా వ్యవహరించి ఇజ్రాయెల్ పౌరులను కాపాడిన భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్‌ను కూడా వేడుకలకు ఆహ్వానించినట్లు నెతన్యాహు తెలిపారు. మోదీతో కలిసి ఆయన టార్చ్ వెలిగించే కార్యక్రమంలో పాల్గొనాలని ఆకాంక్షించారు. కాగా, ప్రధాని మోదీ ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇజ్రాయెల్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. తాజా ఆహ్వానం ఇరు దేశాల మధ్య సంబంధాల ప్రాధాన్యాన్ని మరోసారి చాటింది.

## డిసెంబర్‌లో తెలంగాణకు ప్రధాని మోదీ!

(మొదటి తరువాయి)



హైదరాబాద్‌లోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతల సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు. వివిధ మోర్చాల అధ్యక్షులు, పార్టీ ముఖ్యనేతలు కూడా హాజరయ్యారు. రాష్ట్రంలో పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రభుత్వ విధానాలపై ప్రజల్లోకి వెళ్లే అంశాలపై చర్చించినట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నవంబర్ 1న హైదరాబాద్‌లో భారీ నిరసన ర్యాలీ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ కార్యక్రమాలు చేపట్టాలని నేతలు భావిస్తున్నారు. వివిధ రాజకీయ సంస్థల వైఖరిని వ్యతిరేకిస్తూ పాదయాత్ర నిర్వహించే అంశంపైనా చర్చించినట్లు తెలిసింది. ప్రజాస్వామ్య పరిరక్షణ, గుంపు రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని రామచందర్‌రావు పిలుపునిచ్చినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తమ నిరసనను తెలియజేయాలని నేతలకు సూచించినట్లు సమాచారం. ప్రధాని మోదీ, అమిత్ షా పర్యటనలపై అధికారిక షెడ్యూల్ వెలువడిన తర్వాత కార్యక్రమాలపై మరింత స్పష్టత రానుంది.

## సర్'కు వ్యతిరేకంగా నేడు నిరసన

**-సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్**
**-ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ రద్దు చేయాలని పిలుపు**
**-సంయుక్త కిసాన్ మోర్చా, పీపుల్ ఎగనెస్ట్ ఎస్ఐఆర్ వేదికల నిర్ణయం**
**-13.41 కోట్ల మంది ఓటుహక్కు పునరుద్ధరించాలని డిమాండ్**
**-జిల్లా, తహసీల్ కేంద్రాల్లో ఆందోళనలకు పిలుపు**
**-రాష్ట్ర రాజధానుల్లోనూ నిరసన కార్యక్రమాలు**
**-ఢిల్లీలో ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ప్రదర్శన**
**-శుక్రవారం దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని విజ్ఞప్తి**



న్యూఢిల్లీ
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్--సర్)కు వ్యతిరేకంగా శుక్రవారం దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని సంయుక్త కిసాన్ మోర్చా, పీపుల్ ఎగనెస్ట్ ఎస్ఐఆర్ వేదిక పిలుపునిచ్చాయి. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశాయి. సర్ ప్రక్రియలో ఓటుహక్కు కోల్పోయినట్లు పేర్కొంటున్న సుమారు 13.41 కోట్ల మంది పౌరుల ఓటుహక్కును పునరుద్ధరించాలని ఆ వేదికలు కోరాయి. ఈ డిమాండ్లతో దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపాయి. శుక్రవారం అన్ని జిల్లా, తహసీల్ కేంద్రాలతో పాటు రాష్ట్ర రాజధానుల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చాయి. రాజధాని ఢిల్లీలో ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించాలని కోరాయి. సర్ ప్రక్రియ, ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు అంశాలపై తమ నిరసనను తెలియజేయడమే ఈ కార్యక్రమాల ఉద్దేశమని పేర్కొన్నాయి.

## డ్రైవింగ్ లైసెన్స్‌కు 75 శాతం మార్కులు తప్పనిసరి!




న్యూఢిల్లీ, అక్టోబర్ 22
ఆధార్ ధృవీకరణ ద్వారా పూర్తిచేసే కొన్ని ఆన్‌లైన్ డ్రైవింగ్ లైసెన్స్ సేవలకు ఫీజు మినహాయింపుతో పాటు సురక్షిత డ్రైవింగ్ శిక్షణ మదింపు కోసం అర్హత పరిమితిని(పాస్ మార్కులు) 60 శాతం నుంచి 75 శాతానికి పెంచాలని కేంద్ర రహదారులు, రవాణా మంత్రిత్వశాఖ ప్రతిపాదించింది. ప్రతిపాదిత మార్పుల లక్ష్యం డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనలకు మదింపు అర్హతలను కఠినతరం చేయడమేనని ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.సురక్షిత డ్రైవింగ్‌కు సంబంధించిన శిక్షణ కనీసం 30 నిమిషాలపాటు ఉండాలని కేంద్ర మోటర్ వాహనాల నిబంధనలకు ప్రతిపాదించిన సవరణల ముసాయిదాలో రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ పేర్కొంది. ఈ ప్రతిపాదన ప్రకారం లైసెన్సింగ్ అధికారులు పేరు, చిరునామాతో సహా డ్రైవింగ్ లైసెన్స్ వివరాలను మార్చడానికి చేసే దరఖాస్తులను తిరస్కరణకు గల కారణాలు సహా తెలియచేస్తూ 15 రోజుల్లోపు ఆమోదించాలి లేదా తిరస్కరించాలి. అలాగే దరఖాస్తుదారుని పేరు, చిరునామా సహా వ్యక్తిగత వివరాల్లో మార్పులు చేసేందుకు విధించే రుసుములను తొలగించాలని కూడా ముసాయిదాలో ప్రతిపాదించారు. దరఖాస్తుదారులు తమ గుర్తింపు, వయస్సు, నివాస ధృవీకరణ కోసం ఉపయోగించే పత్రాలను కూడా ముసాయిదా నిబంధనలు నిర్దేశిస్తున్నాయి

## కరువు వేళ రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

(మొదటి తరువాయి)

తగలబడుతుంటే ఫిడేల్ వాయించినట్లు ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారు' అంటూ విమర్శించారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని హరీశ్‌రావు అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు పది నెలల క్రితమే ప్రభుత్వాలను హెచ్చరించారని పేర్కొన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదని ఆరోపించారు. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10--12 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. పత్తి పంట పరిస్థితి మరింత దారుణంగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని, రైతులు పెట్టిన పెట్టుబడులు సైతం తిరిగి పొందలేని పరిస్థితి నెలకొందని అన్నారు. పంట నష్టంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనేక జిల్లాల్లో ప్రజలు తాగునీరు, సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ఇతర రాష్ట్రాలు కరువు మండలాలను ప్రకటించి రైతులకు తక్షణ ఆర్థిక సాయం అందిస్తున్నాయని, తాగునీటి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం జిల్లా కలెక్టర్లకు నిధులు విడుదల చేస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం ఇప్పటివరకు కరువు మండలాల ప్రకటన, తక్షణ ఆర్థిక సాయం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టలేదని విమర్శించారు. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాల విషయంలోనూ ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రస్తుతం విద్యుత్ అవసరాలు పెరిగిన సమయంలో విద్యుత్ లేదంటూ ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని విమర్శించారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి, పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

## ముంబైకు బిష్ణోయ్ గ్యాంగ్ ముప్పు




ముంబై లోని జుహు ప్రాంతంలో ఆదివారం సాయంత్రం బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పులు జరగడం మహారాష్ట్ర ప్రభుత్వానికి బహిరంగ సవాలుగా చెప్పవచ్చు. ఈ కాల్పుల సంఘటనలో బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్, ఆయన డ్రైవర్, అక్కడ ఉన్న ఒక వ్యక్తి గాయపడ్డారు. ఈ సంఘటన అక్కడ ఉన్న ప్రతి ఒక్కరి ప్రాణాలకు ప్రమాదం కలిగించే భయంకర సంఘటనగా ఆందోళన కలిగించింది. దీంతో వ్యవస్థీకృత నేరాలను అరికట్టడానికి నిరంతర చర్యలు తప్పవని హెచ్చరించినట్టయింది. అయితే బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యులమని చెప్పుకున్న ఇద్దరు వ్యక్తులు ఈ దాడికి తామే బాధ్యులమని సోషల్ మీడియాలో విడుదల చేసిన ఆడియో క్లిప్పులో ప్రకటించారు. గతంలో తాము హెచ్చరించినప్పటికీ ష్రాఫ్ పట్టించుకోలేదని, సల్మాన్‌ఖాన్‌పైనా, ఆయనతో కలిసి పనిచేసేవారిపైనా దాడులు చేస్తామని బెదిరించారు. ఈ ఆడియో క్లిప్ ఎంతవరకు వాస్తవమైనదో పోలీసులే నిర్ధారించాలి. ఈ సంఘటనకు సంబంధించి ఆయుధ సరఫరా ఆరోపణలపై కొందరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వ్యవస్థీకృత నేరాలు ఆర్థిక రాజధానిగా పేరున్న ముంబై నగర ఆర్థిక వ్యవస్థకు, సంస్థలకు, ప్రజల విశ్వాసానికి ఎంతటి నష్టం కలిగిస్తున్నాయో చెప్పలేం. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ హోంశాఖను కూడా నిర్వహిస్తున్నారు. ముంబై గ్యాంగ్‌స్టర్ల ఇష్టారాజ్యంగా మారకుండా తగిన చర్యలు ఫడ్నవీస్ తీసుకున్నప్పుడే ప్రజల్లో భయాందోళనలు తగ్గుతాయి. ముంబైలో బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌ను టార్గెట్ చేసుకుని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఎన్నోసార్లు బెదిరించారు. ఆయన నివాసం వద్ద కాల్పులు జరిపారు. సల్మాన్‌ఖాన్‌ను ఈ గ్యాంగ్ ప్రధాన టార్గెట్‌గా చేసుకోవడానికి 1998లో సల్మాన్‌ఖాన్ కృష్ణజింకను వేటాడడమే కారణం. ఈ కేసుతో బిష్ణోయ్ గ్యాంగ్‌తో వివాదం పెరిగింది. బిష్ణోయ్ సమాజం కృష్ణజింకను ప త్రంగా భావిస్తుంది. అప్పటి నుంచి సల్మాన్‌ఖాన్‌తో అత్యంత సన్నిహిత్వం ఉన్న ప్రముఖులను హత్య చేయడం ప్రారంభించింది. సల్మాన్‌ఖాన్‌తో సాన్నిహిత్యంగల మాజీ మహారాష్ట్ర మంత్రి ఎన్‌సిపి నాయకుడు బాబా సిద్ధిఖీని 2024 అక్టోబర్ 12న హత్య చేసింది. ఈ హత్యతో తన ఆధిపత్యాన్ని చాటుకుంది. 2026 ఫిబ్రవరి 1న దర్శకుడు రోహిత్ శెట్టి నివాసం వద్ద బిష్ణోయ్ గ్యాంగ్ కాల్పులు జరిపింది. టీ సిరీస్ వ్యవస్థాపకుడు గుల్షన్ కుమార్, సినీ నిర్మాత రాకేశ్ రోషన్‌లపై కూడా ఈ గ్యాంగ్ దాడులు జరిపింది. తాజాగా అక్టోబర్ 18న నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు జరిపింది. దేశంలో అనేక హత్యలు, కిడ్నాప్‌లు, అక్రమ వసూళు తదితర నేరాలు ఈ బిష్ణోయ్ గ్యాంగ్ ఆధ్వర్యంలోనే జరుగుతున్నా యి. మహారాష్ట్రతోపాటు పంజాబ్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాల్లో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ అనేక నేరాలకు పాల్పడుతోంది. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) గ్యాంగ్‌స్టర్ ఉగ్రవాద నెట్‌వర్క్‌లో బిష్ణోయ్‌ను 23వ నిందితుడుగా గత మే నెలలో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. విదేశాల్లో కూడా ఈ గ్యాంగ్ ప్రజలను బెదిరించి అక్రమంగా వసూళ్లు చేయడం, కాల్పులు జరపడం తదితర నేరాలకు పాల్పడుతోంది. 2025 సెప్టెంబర్ 29న బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థ జాబితాలో అమెరికా చేర్చింది. అమెరికా న్యాయశాఖ అంతర్జాతీయ ఆపరేషన్‌లో భాగంగా బిష్ణోయ్ నెట్‌వర్క్‌పై నిఘా పెంచింది. అక్రమ వసూళ్లు, మాదకద్రవ్యాల రవాణా, హింసాత్మక నేరాలకు పాల్పడినట్టు ప్రకటించింది. ఈ గ్యాంగ్‌కు చెందిన రోహిత్‌గోదారా యూరప్ ప్రాంతీయ కార్యకలాపాలను నిర్వహించినట్టు అమెరికా న్యాయశాఖ గత జులైలో ప్రకటించింది. అమెరికా ఫెడరల్ అభియోగపత్రం ప్రకారం జైల్లో నుంచే లారెన్స్ బిష్ణోయ్ తన నెట్‌వర్క్‌కు ఆదేశాలు జారీ చేసినట్టు ఆరోపించింది. ఈ గ్యాంగ్‌తో సంబంధం ఉన్న గోల్డీబ్రార్, రోహిత్ గోదారా ఉత్తర అమెరికా, యూరప్ దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నట్టు ఆయా దేశాలు వెల్లడించాయి. కెనడాలో 2023 జూన్ 18న హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య జరిగింది. బిష్ణోయ్, గోల్డీ బ్రార్ ఈ హత్యకు ఆదేశాలు ఇచ్చారని గత జులైలో అమెరికా ఫెడరల్ అభియోగపత్రం వెల్లడించింది. భారతదేశ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) 2024, 2026 నివేదికల్లో లారెన్స్ బిష్ణోయ్ నెట్‌వర్క్‌లో దాదాపు 700 నుంచి 800 మందివరకు కార్యకర్తలు ఉన్నట్టు బయటపెట్టింది. అయితే కెనడాలో ఈ గ్యాంగ్ నెట్‌వర్క్‌లో 1000 నుంచి 5000 మంది వరకు కార్యకర్తలు ఉన్నారని ఆరోపణలున్నాయి. లారెన్స్ జైలులో ఉన్నప్పటికీ వీరందరికీ ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తుంటారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యం నేర ముఠాలను పూర్తిగా నిర్మూలించడమే కావాలి. కాల్పులు జరిపిన వారిని అరెస్టు చేయడంతో సరిపోదు. నేరగాళ్ల నియామకం నుంచి ఆయుధాల సరఫరా, ఆర్థిక సాయం, అక్రమ రవాణా, స్థావరాలు, ఇవన్నీ దర్యాప్తు సంస్థలు గుర్తించి చర్యలు తీసుకోవాలి. నేరగాళ్లకు అనవసరమైన ప్రచారం జరగకుండా ప్రభుత్వం మీడియా సంస్థలతో కలిసి ఒక ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని రూపొందించాలి. ఈ విధానాల వల్ల కొత్త నేరగాళ్ల ఆవిర్భావం పూర్తిగా ఆగిపోకపోవచ్చు కానీ సెలబ్రిటీలపై దాడుల చేయడానికి ప్రేరేపించి, తద్వారా ప్రచారం పొందాలనే ద్రోహాన్ని తగ్గించవచ్చు. అక్రమంగా డబ్బు సంపాదించడమే కాకుండా సమాజంపై తమ ఆధిపత్యాన్ని చెలాయించాలన్న ఈ వ్యవస్థీకృత నేర ముఠాల కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయకపోతే దేశానికే నిత్యం ముప్పు పొంచి ఉంటుంది.

# ఉరిశిక్షలు ప్రజాస్వామికమేనా?



ఆనాడు మహేంద్ర కర్మపై, మావోయిస్టు పార్టీ దాడి చేసి చంపింది అనే కారణంతో.. ఈనాడు మావోయిస్టు పార్టీకి చెందిన ఆదివాసి బిడ్డలకు ఉరిశిక్ష ఖరారు చేసింది ఎన్ఐఎ కోర్టు! 2013 మే 25న చత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా దర్భా లోయ, ఝీరాం ఘాటీ ప్రాంతం వద్ద జరిగిన దాడి కేసులో.. కాంగ్రెస్ పార్టీ పరివర్తన యాత్ర కాన్వాయిపై, మావోయిస్టు పార్టీ గిరిజనులతో కలిసి దాడి చేసింది. ఆ దాడిలో చత్తీస్‌గఢ్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహేంద్ర కర్మతో పాటు మొత్తం 27 మంది వరకు మరణించారు! ఆనాటి ఈ దాడి ఘటనకు సంబంధించి, గత నెల 16 సెప్టెంబరు 2026 న ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు, పది మంది మావోయిస్టులకు ఉరిశిక్ష విధించింది! ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం, ఈ పరిణామం దేనికి సంకేతం? కగార్ ఆపరేషన్ కంటే ముందు నుండే ఆయుధాలు వీడి ప్రజాస్వామిక పద్ధతుల్లో పనిచేయండి అనీ ప్రభుత్వం మావోయిస్టులకు పిలుపునిచ్చింది!ప్రభుత్వం వేలాదిమంది సైనిక బలగాలను రప్పించి, మావోయిస్టు పార్టీని ఉక్కుపాదంతో అణచివేసింది! శవాల గుట్టలు, రక్తపాతాలు నిత్యకృత్యం అయ్యాయి! వందలాది మంది మావోయిస్టులు అధునాతన ఆయుధాలతో వచ్చి, ప్రభుత్వం ముందు లొంగిపోయారు! ఇప్పుడున్నది మావోయిస్టు రహిత భారతదేశం అని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది! ఈ విధంగా ఇప్పుడు మావోయిస్టు పార్టీ పూర్తిగా లేకుండాపోయింది అని ప్రభుత్వమే ప్రకటించిన నేపథ్యంలో.. ప్రస్తుతం మావోయిస్టులపై మోపబడిన నేరాలు, శిక్షలు వంటి కీలక విషయాల్లో, ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరించాల్సి ఉంటుంది అంటే, నూటికి నూరు శాతం ప్రజాస్వామికంగానే, మానవీయంగానే వ్యవహరించాల్సి ఉంటుంది! మావోయిస్టుల నేరాలపై అమలు చేయాలనుకున్న శిక్షల విషయంలో.. ఆ శిక్షల తీవ్రతను తగ్గించే ఒక ప్రజాస్వామిక వాతావరణాన్ని ప్రభుత్వం నెలకొల్పాలి! గతంలోవలె అణచివేత విధానాలను పాటించకూడదు! కానీ ఇప్పుడు జరుగుతున్నది ఏమిటి? ఆనాడు ఆ నేరాలకు పాల్పడ్డారు అనే కారణంతో.. మావోయిస్టు పార్టీలో పని చేసిన అడవి బిడ్డలకు, ఈరోజు ఉరిశిక్షలు ఖరారు చేశారు! ఈ నిర్ణయం న్యాయమేనా? మానవీయమేనా? ప్రభుత్వం ఆలోచించాలి? ఇంతకూ ఈ దేశంలో ఎవరికి ఉరిశిక్షలు పడాలి? నేరస్థులకా? నేర సంస్కృతికా? రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, ఆ నేరమయ సంస్కృతిని వ్యవస్థీకృతం చేసీ.. సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానతలకు కారణమైన పాలక ప్రభుత్వాలకా? ఎవరికి పడాలి ఈ శిక్షలు? ఆనాడు 'పార్లమెంటరీ వ్యవస్థను కూల్చేస్తాం' అనే నినాదంతో బయలుదేరిన వారు చట్ట ప్రకారం నేడు నేరస్థులైతే.. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన చేస్తున్న వాళ్లు, ప్రజల రక్షణ కోసం ఏర్పడిన చట్టాలను అమలు చేయని వాళ్ళు, ప్రజాస్వామ్యానికి ప్రాణమైన ఎన్నికల వ్యవస్థను భ్రష్టుపట్టించిన వాళ్ళు, అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమంగా భూములు ఆస్తులు కొల్లగొట్టిన వాళ్లు.. ఒక్కమాటలో చెప్పాలంటే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రజావ్యతిరేక పాలన చేస్తున్న వాళ్లు, నేరస్థులు కారా? తప్పులు చేసిన వాళ్ళు తమ తప్పులు తెలుసుకుని, సరిదిద్దుకునే విధంగా.. సంస్కరణ వాద స్పృహతో శిక్షల విధానం ఉండాలే తప్పా.. తప్పులు చేసిన వాళ్లకు ఇక జీవితమే ఉండకూడదు, శిక్ష పేరుతో వాళ్ళని చంపేయాలి.. అని ప్రభుత్వమే భావిస్తే, అది ప్రజాస్వామిక ప్రభుత్వం అవుతుందా? వ్యక్తి ఆలోచన కంటే ప్రభుత్వం ఆలోచన.. గొప్పగా మానవీయంగా ఉండాలి కదా! ఒక వ్యక్తి హత్య చేసి నేరస్థుడు అయినప్పుడు, ప్రభుత్వం కూడా శిక్ష పేరుతో వ్యక్తిని హత్య చేస్తే, అది నేరం కాకుండా పోతుందా? అందుకే నేరాలు, శిక్షలు వంటి విషయంలో, ప్రభుత్వ పాలన ప్రజలను సంస్కరించే విధంగా ఉండాలి తప్పా.. ప్రభుత్వమే హంతకుడుగా మారి, ప్రజలను హత్య చేసే విధంగా, పాలన విధానాలు ఉండకూడదు! రాజ్యాంగం ఇచ్చిన జీవించే హక్కును కాలరాయకూడదు! సాయుధ పోరాటం వల్ల తరతరాలుగా ఉద్యమ ప్రజలు సర్వము కోల్పోయారు! ఇక భవిష్యత్తులో కూడా, అది ఈ దేశంలో సఫలం కాదని చరిత్ర చెబుతుంది! కాబట్టి మావోయిస్టు పార్టీ నాయకులు, చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామిక పార్టీని నిర్మాణం చేయాల్సిన అవసరం ఉంది! అదే సమయంలో మావోయిస్టు పార్టీ పేరును, దాని అనుబంధ సంఘాల పేర్లను అన్నిటిని తొలగించాలి! మళ్లీ కొత్తగా ప్రతిదీ ప్రజాస్వామిక పద్ధతిలో నిర్మాణం కావాలి! ఉద్యమాల్లో మార్క్సిస్టు సిద్ధాంతమే గైడ్‌లైన్‌గా ఉండాలి తప్పా, మరొక పేరుతో కాదు! అందుకే ఇలాంటి చర్చనీయాంశాలను చర్చించాలంటే, దేవ్ జీ బృందం చేయాల్సిన పని.. మాజీ మావోయిస్టులందరినీ సమావేశపరచడానికి బహిరంగ పిలుపు ఇవ్వాలి! రెండు మూడు రోజుల పాటు కొనసాగేలా ఈ సమావేశం ఉండాలి. ఎంతో మహోజ్వలంగా సాగిన విప్లవోద్యమం, పూర్తిగా అంతరించిపోవడానికి.. పార్టీ వైపు నుంచి, నాయకత్వం వైపు నుంచి, ఉద్యమ శ్రేణుల వైపు నుంచి జరిగిన తప్పిదాలను వైఫల్యాలను సమీక్షించుకునే విధంగా సమావేశం జరగాలి! ప్రస్తుత పరిస్థితుల్లో పూర్తిగా రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయడానికి, ఎలాంటి విధానాలు ఏర్పరుచుకోవాలి అన్న అంశాలపై, ప్రతి వ్యక్తి ఐదు నుంచి పది నిమిషాల పాటు తన అనుభవాలను చెప్పే విధంగా సమావేశం ఉండాలి! ఆ విధంగా అందరి సమష్టి ఆలోచనలను పరిగణలోకి తీసుకొని, రాజ్యాంగ విధానాలకు లోబడే ఒక ప్రజాస్వామిక పార్టీని ఏర్పాటు చేయాలి! అప్పు డే అది ప్రజల్లో విస్తృతంగా పనిచేసి, ప్రజల ఆమోదం పొందగలుగుతుంది. ఉద్యమ లక్ష్యాన్ని సాధించగలుగుతుంది! ఈ విధంగా సామాజిక బుద్ధిజీవుల నుండి, ఉద్యమ శ్రేయోభిలాషుల నుండి తీసుకున్న ఈ సూచనలను, దేవ్ జీ బృందం లేదా మొత్తం కేంద్ర మాజీ నాయకత్వం పరిశీలించి, సాధ్యమైనంత తొందరగా భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను ప్రారంభిస్తారని, ఉద్యమ ప్రజలు ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు! విప్లవ సహచరుల ఉరిశిక్ష రద్దు కోసం ఉద్యమాలు చేసి విఫలమైన సరే, ప్రజలు అర్థం చేసుకుంటారు. కానీ ఏమీ చేయకుండా, అధినాయకత్వం ఈ విధంగా మౌనంగా ఉంటే ప్రజలు సహించరు! రేపొద్దున ఆ పదిమంది మావోయిస్టులకు ఒక వేళ ఉరిశిక్ష అమలు అయితే.. అప్పుడు ఈ దేవ్ జీ బృందం మొత్తం కేంద్ర మాజీ నాయకత్వం, ఉద్యమ ప్రజల నుండి తీవ్రమైన నిరసన ఎదుర్కోవాల్సి వస్తుంది! అప్పుడు చరిత్రలో వీళ్ళు ప్రజా వంచకులుగా మిగిలిపోక తప్పదు! కాబట్టి నమ్ముకున్న ప్రజల జీవన వికాసం కోసం, మాజీలంతా ఐక్యమవ్వాలి! ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రజా పోరాటాలు నిర్వహించాలి!

# నిద్ర వీడి.. నిప్పు కణాలైతేనే!



దసరాతో నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. పాతిక యేళ్ల కిందటితో పోలిస్తే మన పండుగల తీరెతెన్నులే మారిపోయాయి. ముఖ్యంగా యువత పరంగా! పండుగలు,- ఉత్సవాలు అంటే మద్యంలో మునిగి తేలడం. దసరా సరదా తీర్చుకోవడంలో ఎన్ని బీరు బాటిళు ఖాళీ అయ్యాయి. ఎన్ని విస్కీ కార్టున్లు అమ్ముడయ్యాయి, ఎంత మద్యం తాగారు? రేపో మాపో లెక్కలు పత్రికల పతాక శీర్షిక లెక్కుతాయి. అందులో విశేషమేం లేదు. విషయమేమిటంటే, గ్రామాల్లో ఇదొక జాడ్యంలా తయారైంది. యువతను పూర్తిగా నిర్వీర్యం చేస్తోంది. ఎవరూ చెప్పేవారు లేరు, అధవా చెప్పినా వినేవారు అసలే లేరు. కల్లు, సారా చీప్ లిక్కర్, దేశీ మద్యం, విదేశీ బ్రాండ్లు ఇలా... ఆర్థిక స్తోమత- స్థాయిని బట్టి ఏదో ఒకటి తాగుతున్నారు. వివిధ రూపాల్లో గంజాయి కూడా విస్తరిస్తోంది. సరదాగా మొదలైన అలవాట్లకు క్రమంగా కట్టుబానిసలవుతున్నారు. వాళ్లు-వీళ్లని తేడా లేదు మిగతా విషయాల్లో ఎట్లున్నా తాగుడుకు వచ్చేసరికి ఉద్యోగులు, నిరుద్యోగులు అని తేడా లేదు. వాళ్లు, వీళ్లు కలిసో, విడివిడిగానో తాగుతూనే ఉన్నారు. రోజువారీ తాగుడు ఒకటైతే పండుగలు, పబ్బాలు, ఉత్సవాలు ఒక బలమైన సాకు (బహానా) వారికి. బోనాల పండుగతో మొదలయితే వినాయకోత్సవాలు, వెంటనే నవరాత్రులు, తర్వాత దీపావళి ఇటు అటు అంటే కొత్త సంవత్సరం, అతి దగ్గరలోనే మూడొద్దుల సంక్రాంతి వేడుకల్లో మునిగి తేలడమే! ఉద్యోగులా, వ్యాపారులా, నిరుద్యోగులా అనే తేడాలు లేకుండా మద్యానికి బానిసలవుతున్నారు. జీవితంలో పైకెదగాలనో, జీవన ప్రమాణాలు పెంచుకోవాలనో తపన, పట్టుదల, జిజ్ఞాస వారిలో క్రమంగా సన్నగిల్లుతున్నాయి. సర్కారు వారి పలు స్కీములు కింద లభించే నగదు, చౌక బియ్యం వంటివి అందుబాటులో ఉండటం వల్ల దిగువ మధ్య తరగతి, పేద, నిరుపేద కుటుంబాల కనీస జరుగు బాటుకు ఢోకా లేకపోవడం యువత ఉదాసీన, నిర్లక్ష్య వైఖరికి కారణం కావచ్చని సామాజిక వేత్తలంటారు. ఇరుగు పొరుగు ఏ రాష్ట్రంతో పోల్చినా తెలంగాణలో నిరుద్యోగిత తక్కువేం లేదు. 15 ఏళ్లు పైబడిన వారిలో నిరుద్యోగిత రేటు భారత సగటు 5.4% కాగా తెలంగాణలో అది 5.7%గా నమోదయింది. కూలీల భాగస్వామ్యం రేటు (ఎల్ఎఫ్‌పిఆర్) కూడా తెలంగాణలో ఎక్కువే. తాజా (పిఎల్ఎఫ్ఎస్) సర్వే ప్రకారం దేశ సగటు 54.6% ఉంటే, తెలంగాణలో 58.2% గా తేలింది. అంటే 15 ఏళ్ల పైబడ్డ ప్రతి 10 మందిలో 6 మంది తగిన పని/ ఉద్యోగం కోసం నిరీక్షిస్తున్నారని లెక్క. తెలంగాణ యువతలో (15 29 యేళ్లు) నిరుద్యోగం రేటు 19.3% అన్నది జాతీయ సగటు కన్నా మూడు రెట్లు అధికం. అందుకే, టెన్త్- ఇంటర్ డ్రాపౌట్స్, డిగ్రీ, డిస్కంటిన్యూలు, ఇంజనీరింగ్‌లోనో, ఏదో సాధారణ డిగ్రీలోనో పట్టా పొందినా ఉద్యోగం లేని, ఉపాధి దొరకని వారు లక్షలమంది ఉన్నారు. సరదాతోనో, అసహనంతోనో మొదలయ్యే తాగుడు అలవాటు వ్యసనంగా మారాక వారా విష వలయం నుండి బయట పడలేకపోతున్నారు. కష్టపడి అదనపు కోర్సులతోనో, నైపుణ్యాల వృద్ధితోనో మంచి ఉద్యోగం పట్టుకోవాలన్న తృష్ణ, పట్టుదల వారిలో చచ్చిపోతోంది. నిన్న కన్నా ఇవాళ, ఇవాల్టి కన్నా రేపు వారు మరింత బలహీనులవుతున్నారు. రాజీపడి, ఏ ఎదుగుదలా లేని అధ్వానపు బతుకులీడుస్తున్నారు. వెలిగే మరో పార్శ్వం ఐటి, ఎఐ వంటి సాంకేతికతను బాగా అందిపుచ్చుకున్న యువతరం మరోవైపు అంచనాలకు మించి ఎదుగుతోంది. విషయంతోపాటు భాష, భావప్రసరణ (కమ్యునికేషన్)లో నైపుణ్యాలు సాధించి ప్రపంచ మూల మూలకూ విస్తరిస్తున్నారు. ఆర్థిక సరళీకరణ, మారిన మార్కెట్ పరిస్థితుల్లో దేశంలోనూ వారికి అవకాశాలు పెరుగుతున్నాయి. అయితే వీరి శాతం చాలా తక్కువ. అటువంటి యువత తెలుగు వాళ్లలోనూ ఉంది. 'కెరీరిజం' తప్ప మరో ధ్యాస ఉండదు, వారిలో సామాజిక స్పృహ జీరో అన్న ఇదివరకటి పరిస్థితి మారింది. వారి దృక్పథంలో, ఆత్మవిశ్వాసంలో, ఆలోచానా సరళిలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. 'నీట్' పేపర్ లీక్ దరిమిలా సాగిన విద్యార్థి, యువ ఉద్యమం పలు ప్రతిఘటనల మధ్య కూడా ఫలితం సాధించింది. ఎన్నికల ప్రక్రియను సంస్కరించాలి, సిఇసి దిగిపోవాలనే డిమాండ్ తో ఇప్పుడు సాగుతున్న ప్రజాందోళనలో యువత క్రియాశీలకంగా ఉంది. ఇవన్నీ గమనిస్తున్న వారు గుర్తిస్తున్నదొక్కటే, యువత ఆలోచన సరళి మారింది. 'కెరీరిజం' గంతలతో సాగే జట్కా గుర్రంలా కాకుండా సమాజాన్ని, సమస్యల మూలాల్ని వారు గ్రహిస్తున్నారు. తగు బాధ్యతతో స్పందిస్తున్నారు. సహనం, పట్టుదల, సమర్థ అభివ్యక్తితో వ్యవహరిస్తున్నారు అని రుజువైంది. 'కాక్రోచ్' అనే మాట వాడి సిజెపి పుట్టుకకు కారణమైన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ గొంతు సవరించుకొని యువతకు కితాబిచ్చారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో, 'బెంగళూరు'లో పలు సందర్భాల్లో మాట్లాడుతూ 'భారత యువత నడతను చూసి గర్విస్తున్నాన'న్నారు. ఉద్ధవ్ థాకరే (శివసేన) ముంబై శివాజీ పార్కులో జరిగిన దసరా ర్యాలీలో మాట్లాడుతూ 'అవగాహనతో వీధుల్లోకి వచ్చి పోరాడుతున్న యువత విప్లవ యోధుల'న్నారు. 'దేశ యువతలో పెరిగిన ఆత్మవిశ్వాసం, ప్రయోగశీలత, మూస పద్ధతికి భిన్నంగా ఆలోచించే ధోరణి దేశంలో వస్తున్న పెను మార్పుకు సంకేతమ'ని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సెలవిచ్చారు. ఆర్ఎస్ఎస్ అధినేత (సర్ సంఘ్ చాలక్) మోహన్ భాగవత్ అయితే యువతను ఏకంగా ఆకాశనికెత్తారు. కిందటి తరం యువతకన్నా, ఇప్పుడున్న భారత్ యువతరం అధిక నిజాయతీ పరులని, ప్రశ్నించడం అలవడి, హేతుబద్ధంగా ఆలోచిస్తున్నారని ప్రశంసించారు. సాంకేతికత వాడుకుంటూ, తెలివితేటలు, -నైపుణ్యాలు పెంచుకుంటూ ఒకవైపు యువత తమ పరిస్థితి మెరుగుపరుచుకుంటూనే మరోవైపు సమాజం గురించి ఎంతో బాధ్యతగా ఆలోచిస్తోంది. కార్యాచరణ అమలు చేస్తోంది. మరోవైపు మెజారిటీ యువత నిరుద్యోగం, ఉపాధి లేమితో కొట్టుమిట్టాడుతూ మద్యం, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసవుతోంది. తెలుగు తేజం వెలగాలి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో యువత అప్రమత్తం కావాలి. ఆత్మపరిశీలన జరగాలి. దేశ యువతరమంతా పురోగామిగా సాగుతున్నప్పుడు వెనుకబాటు తగునా? అని తెలుగు యువతరం ఆలోచించాలి. తాత్కాలికమైన తృప్తినిచ్చి, మత్తులో జీవితాల్నే చిత్తుచేసే మద్యం మహమ్మారి మాయా వల(యం) నుంచి బయటపడాలి. చిత్తశుద్ధితో ఎవరికి వారు ఆలోచించి, 'నడత' మార్చుకొని సమాజానికి బలమైన వనరుగా మారాల్సిన సమయం. 'విడో పెన్షన్ల మంజూరీకి పేర్ల నమోదు కోసం వెళితే గ్రామాల్లో ఎక్కువ మంది యువతులు, నడి వయస్కులు పేర్లు రాపించుకుంటున్నారు. ఏమిటని ఆరాతీస్తే, వారి భర్తలు చిన్న వయసులో తాగుడుకు బానిసలై చనిపోయినట్టు తెలుస్తోంది' అన్న తెలంగాణ (మెదక్ జిల్లా) ఎంపిడిఓ ఒకరి మాటలు ఎవరి గుండెనైనా కలతపెట్టేవే! కంటతడి పెట్టించేవే!! ఎందరో జాతి వైతాళికులు ప్రేరణనిచ్చిన గడ్డ మన తెలుగు నేల. ఐడి కార్డు లేదని జవహర్ లాల్ నెహ్రూనే లోనికి అనుమతించని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, విశ్వస్థాయిలో మేధస్సు -తరగని గుండె ధైర్యం కలగలిసిన జార్జిరెడ్డి, రాజు ఎంత బలవంతుడయినా తాను ప్రజాపక్షం వహిస్తానని 'నిజం' కోసం గొంతువిప్పి ప్రాణాలర్పించిన షోయబుల్లాఖాన్ వంటి వారు నడయాడిన నేల ఇది. ఈ నేలలో మొగ్గతొడిగిన యువ కిశోరాలు లక్ష్యం లేకుండా రాజీపడొద్దు. మద్యం మత్తులో జోగొద్దు. జాగ్రుతం కావాలి. తమను తాము మెరుగుపరుచుకుంటూ సమాజానికి సమర్థ వనరు కావాలి.

మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ
డ్రీమ్ టైమ్స్
తెలుగు దిన పత్రిక
DREAM TIMES DAILY NEWS PAPER

# బెదిరింపులకు భయపడం: శిల్పా రవి

**-మునిసిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ దౌర్జన్యాలపై పోరాటం**

**-51వ వార్డులో ఫోర్జరీ సంతకంతో ఉపసంహరణ పత్రం అందజేత ఆరోపణ**



**నంద్యాల బ్యూరో, అక్టోబర్ 22 (డ్రీమ్ టైమ్స్):**
మునిసిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు చేస్తున్న బెదిరింపులను, దౌర్జన్యాలను ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని మూడు వార్డుల్లో ఎస్.డి.పి.ఐ. అభ్యర్థులు వైఎస్ఆర్సీపీ తరపున పోటీ చేస్తున్నారని తెలిపారు. అయితే, ఆ అభ్యర్థులపై కేసులు పెడతామని, వారి వ్యాపారాలను దెబ్బతీస్తామని అధికార పార్టీ నేతలు బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇలాంటి బెదిరింపులకు తాము ఏమాత్రం భయపడే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. 51వ వార్డులో వైఎస్ఆర్సీపీ అభ్యర్థి నాగమణి పోటీ నుంచి తప్పుకున్నట్లు ఫోర్జరీ సంతకంతో ఉపసంహరణ పత్రాన్ని అధికారులకు అందజేశారని శిల్పా రవి ఆరోపించారు. దీని ఆధారంగా తాము ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికార పార్టీ నేతలు హంగామా చేస్తున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే ఎన్నికల అధికారులకు, జిల్లా కలెక్టర్ రాజకుమారికి ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు. ఈ అంశంపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఇషాక్ బాషా పాల్గొన్నారు.

# చంద్రబాబు మెప్పు పొందిన డా. అరిఫా భాను

**-నంద్యాల చైర్మన్ సీటుపై సీఎం వ్యాఖ్యలతో పట్టణంలో చర్చ**



**నంద్యాల బ్యూరో, అక్టోబర్ 22 (డ్రీమ్ టైమ్స్):**
నంద్యాల మునిసిపల్ చైర్మన్ సీటుకు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ సమావేశంలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పట్టణంలో హాట్ టాపిక్‌గా మారాయి. "నంద్యాలలో మంచి అమ్మాయికి సీటు ఇచ్చాం, కానీ ఆ అమ్మాయి ముందుకు రాలేదు. దానికి కారణాలు వేరే ఉన్నాయి, మరోసారి విశ్లేషణ చేస్తాను" అని ఆయన పేర్కొన్నారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. సీఎం ప్రస్తావించిన ఆ యువతి ఎవరన్న దానిపై పట్టణంలో విస్తృత చర్చ జరుగుతోంది. ఆమె డా. అరిఫా భాను. పద్మావతి నగర్‌లోని జి.వి.ఆర్. ఆసుపత్రిలో న్యూరోసైకియాట్రిస్ట్‌గా సేవలందిస్తున్నారు. డిజిటల్ క్రియేటర్‌గా మానసిక, సామాజిక సమస్యలపై ఆమె సోషల్ మీడియాలో చేసిన వీడియోలు యువతను ఆకట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో చైర్మన్ అభ్యర్థి ఎంపికలో ఆమె పేరును కూడా పార్టీ పరిశీలించింది. అయితే చివరి నిమిషంలో టికెట్ డా. బాబన్‌కు దక్కింది. సీఎం వ్యాఖ్యలపై స్పందించిన డా. అరిఫా భాను, చంద్రబాబు తనను మెచ్చుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని, సీఎం ఇచ్చిన ప్రోత్సాహంతో మరిన్ని కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. ఒకవేళ ఆయన ఏదైనా బాధ్యత అప్పగిస్తే చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని ఆమె స్పష్టం చేశారు.

# 50 వ వార్డులో కానాల రేణుక రెడ్డి ముమ్మర ప్రచారం....

**సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించండి.. వార్డును అభివృద్ధి చేస్తాం..**





**నంద్యాల**
నంద్యాల పట్టణంలోని 50 వ వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి కానాల రేణుక రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. 50 వ వార్డు పరిధిలోని నందమూరి నగర్ లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను కలుసుకుని,వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్ర మంత్రివర్యులు ఎన్ ఎమ్ డి ఫరుక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ సహకారంతో పార్టీ బీఫారం పొందిన కానాల రేణుకా రెడ్డి ప్రజల మద్దతుతో విజయం సాధించి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ పాల్గొని వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కానాల రేణుక రెడ్డి కృషి చేస్తుందని 50 వ వార్డు భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు ఏ సమస్య ఎదురైనా కానాల రేణుక రెడ్డి, వారి తండ్రి (చికెన్ జయరాం రెడ్డి) వారి తనయుడు హిమేష్ రెడ్డి ముందుండి సహాయం అందిస్తారని 50 వ వార్డులోని ప్రజలంతా కనుల రేణుక రెడ్డి కు మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అభివృద్ధి కొనసాగాలంటే సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కానాల రేణుక రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.....

## నామినేషన్ కేంద్రాల వద్ద నిఘా నీడ..

# పటిష్ట పోలీసు బందోబస్తు!






**-ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్లపై ఎస్పీ ప్రత్యేక దృష్టి**

**-కేంద్రాలను స్వయంగా తనిఖీ చేసిన ఎస్పీ సునీల్ షోరాణ్.. డ్రోన్, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా**



నంద్యాల క్రైమ్ ।డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 22, 2026. నంద్యాల :-ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు నంద్యాల జిల్లా వ్యాప్తంగా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నామినేషన్ కేంద్రాల వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియం, నూనెపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న నామినేషన్ ప్రక్రియను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును తనిఖీ చేసి, విధుల్లో ఉన్న అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా తగినంత పోలీసు సిబ్బందిని నియమించాలని, నామినేషన్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల ద్వారా పరిస్థితులను క్షుణ్ణంగా పర్యవేక్షించాలని సూచించారు. ఏదైనా అవాంఛనీయ ఘటన చోటుచేసుకుంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి, పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. అదేవిధంగా సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే పోస్టులు ప్రచారం చేస్తూ ఉద్రిక్తతలకు కారణమయ్యే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్. ఖాదర్ భాషా, నంద్యాల సబ్‌డివిజన్ ఏఎస్పీ శ్రీమతి సుస్మిత, ఐపీఎస్, సంబంధిత పోలీసు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు

# శ్రీశైలంలో దత్తాత్రేయస్వామివారికి విశేష పూజలు

**డ్రీమ్ టైమ్స్ । తేదీ: 22.10.2026**
శ్రీశైలం: లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద కొలువై ఉన్న శ్రీ దత్తాత్రేయస్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ప్రతి గురువారం దేవస్థానం తరపున సర్కారీ సేవగా ఈ పూజాకైంకర్యాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ముందుగా మహాగణపతి పూజ నిర్వహించి, అనంతరం శ్రీ దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు శాస్త్రోక్తంగా జరిపించారు.

**త్రిమూర్తి స్వరూపుడు దత్తాత్రేయుడు**
లోకోద్ధరణ కోసం బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఏకస్వరూపంగా దత్తాత్రేయునిగా అవతరించారని పురాణ ప్రతీతి. అందుకే దత్తాత్రేయస్వామివారు త్రిమూర్తి స్వరూపునిగా ప్రసిద్ధి చెందారు. శ్రీశైల క్షేత్రానికి దత్తాత్రేయస్వామివారితో ఎంతో విశిష్టమైన సంబంధం ఉంది. ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయస్వామివారు తపస్సు చేశారని ప్రతీతి. ఈ కారణంగా ఆ వృక్షానికి దత్తాత్రేయ వృక్షం అనే పేరు ఏర్పడింది.

**గురుచరిత్రలో శ్రీశైల క్షేత్ర ప్రాశస్త్యం**
దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరి



తీరంలోని పిఠాపురంలో శ్రీపాద వల్లభునిగా అవతరించినట్లు గురుచరిత్రలో పేర్కొనబడింది. శ్రీపాద వల్లభులు ఒకసారి శ్రీశైల క్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లు ప్రతీతి. తన శిష్యులకు వివిధ తీర్థక్షేత్రాల మహిమలను వివరించే సందర్భంలో శ్రీశైల క్షేత్ర ప్రాశస్త్యాన్ని పలుమార్లు ప్రస్తావించినట్లు గురుచరిత్రలో వివరించబడింది. అనంతరం దత్తాత్రేయస్వామివారు మహారాష్ట్రలోని కరంజి నగరంలో శ్రీ నృసింహ సరస్వతి స్వామిగా అవతరించినట్లు గురుచరిత్ర చెబుతోంది. నృసింహ సరస్వతి స్వామివారు మహాశివరాత్రి పర్వదినాన శ్రీశైల మల్లికార్జునస్వామివారిని సేవించినట్లు కూడా పేర్కొనబడింది.

**పాతాళగంగతో ముడిపడిన అవతార సమాప్తి**
శ్రీ నృసింహ సరస్వతి స్వామివారు తమ అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగ వద్ద చేసినట్లు గురుచరిత్రలో వివరించబడింది. కలియుగ ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో అదృశ్యరూపంలో ఉండి భక్తులను రక్షించాలని సంకల్పించిన స్వామివారు, నలుగురు శిష్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చినట్లు ప్రతీతి. శ్రీశైలంలోని కదళీవనం సమీపంలో శిష్యులు చూస్తుండగానే అరటి ఆకులతో చేసిన ఆసనంపై కూర్చొని కృష్ణానదిలో ప్రవేశించి, కొంతదూరం ఆ ఆసనంపైనే ప్రయాణిస్తూ అదృశ్యమైనట్లు గురుచరిత్ర వివరిస్తోంది. దత్తాత్రేయస్వామివారు, శ్రీపాద వల్లభులు, శ్రీ నృసింహ సరస్వతి స్వామివారికి శ్రీశైల క్షేత్రంతో ఉన్న అనుబంధం ఈ క్షేత్ర ఆధ్యాత్మిక ప్రాశస్త్యాన్ని మరింత చాటిచెబుతోంది.

# మంథని షిరిడి సాయిబాబా దేవాలయం నూతన కమిటీ ఎన్నిక



**మంథని, అక్టోబర్ 22 (డ్రీమ్ టైమ్స్):**
మంథని పట్టణంలోని షిరిడి సాయిబాబా దేవాలయానికి నూతన కమిటీని గురువారం నియమించారు. ఆలయ నిర్వహణ, భక్తులకు సేవలు, దేవాలయ అభివృద్ధి లక్ష్యంగా నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆలయ అర్చకులు రామడుగు సాయి శ్రీనివాస్ తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షురాలిగా మహావాది జలజ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా పనకంటి మురళీధర్ రావు, కోశాధికారిగా మహావాది సతీష్ కుమార్ ఎన్నికయ్యారు. భజన మండలి కన్వీనర్‌గా సిద్ధాంత లక్ష్మి శ్రీనివాస్, సహ కన్వీనర్‌గా పద్మజ పురుషోత్తమరావు, సేవా కన్వీనర్లుగా శ్యామల రమేష్, వడ్లకొండ సత్యనారాయణ నియమితులయ్యారు. ప్రచార కన్వీనర్లుగా కడియాల రాజన్న, భువనగిరి రమేష్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులుగా సజ్జనపు శ్యాం, సాయిని కృష్ణమూర్తికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సీతారామ సేవా సదన్ వ్యవస్థాపకులు గట్టు నారాయణ గురూజీ, సదన్ అధ్యక్షులు కెవిఎల్ఎన్ హరిబాబు నూతన కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు, భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు నూతన కమిటీ సభ్యులు సమష్టిగా కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. నూతన కమిటీ నియామకంతో ఆలయంలో భక్తి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడుతుందని భక్తులు ఆశాభావం వ్యక్తం చేశారు..

# భక్తి గీతాలతో అలరించిన శ్రీసీతారామ భజన బృందం




**శ్రీశైలం, అక్టోబర్ 22 (డ్రీమ్ టైమ్స్):**
శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం నిత్య కళారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదికపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన శ్రీసీతారామ భజన బృందం సభ్యులు భజన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులను అలరించారు. ఈ సందర్భంగా జయజయ వినాయక, శంభో శంకరా, ఓం హరశంకరా, కైలాస హిమగిరి శంకరా, శివనామమే, లింగాష్టకం, శ్రీశైల భ్రమరాంబికా, శివశివ శంకరా తదితర భక్తిగీతాలను ఆలపించారు. దుర్గాలక్ష్మి, శ్రీనివాసరావు, భవాని, వెంకటలక్ష్మి, సూర్యభవాని, వరలక్ష్మి, శ్రీలక్ష్మి, వీరలక్ష్మి, ప్రభావతి తదితర కళాకారులు తమ గానంతో భక్తుల్లో ఆధ్యాత్మిక భావాలను నింపారు.శ్రీ స్వామివార్లకు, అమ్మవారికి ఆయా కైంకర్యాలు పరిపూర్ణంగా జరగాలని, ప్రాచీన సంప్రదాయ కళలను పరిరక్షించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దేవస్థానం ధర్మపథం కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాల ద్వారా సంప్రదాయ భజన, సంగీత కళలకు ప్రోత్సాహం లభించడంతో పాటు భక్తుల్లో ఆధ్యాత్మిక చింతన పెంపొందుతోంది.

# గుర్తుతెలియని వ్యక్తుల చేతులలో విద్యుత్ స్తంభాలు ధ్వంసం



**రామగిరి,అక్టోబరు 22 ( డ్రీమ్ టైమ్స్ ):** రామగిరి మండలంలోని వెలగల్పహాడ్ లో గత నాలుగు రోజుల క్రితం ఆదివారం రాత్రి 11 కెవి,6 విద్యుత్ స్తంభాలు గుర్తుతెలియని వ్యక్తుల చేతులలో ధ్వంసం అయ్యాయి.ఎన్పీడీసీఎల్ అధికారులు, రైతులు తెలిపిన వివరాల ప్రకారం ధ్వంసం అయినా విద్యుత్ స్తంభాలను సోమవారం స్థానిక రైతులు గమనించి ఎన్పీడీసీఎల్ అధికారులకు ఫిర్యాదు చేశారు.దీంతో ఎన్పీడీసీఎల్ అధికారులు అలాగే రైతులు, రామగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రామగిరి ఎస్సై తాడవేనా శ్రీనివాస్ ఫిర్యాదు తీసుకొని ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిసింది.విద్యుత్ స్తంభాల ధ్వంసం వెనక రాత్రి వచ్చే వేటగాళ్ల పనా లేక మరెవరి కుట్రైన ఉందా తెలియాల్సి ఉంది. అలాగే సమస్యను వీలైనంత తొందరగా పరిష్కరించి విద్యుత్తును పునరుద్ధరించాలని రైతుల కోరారు.

## వైనాలను పరామర్శించిన శీను బాబు



**రామగిరి అక్టోబరు 22 ( డ్రీమ్ టైమ్స్ ):** కమాన్ పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజును,వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శీను బాబు గురువారం పరామర్శించారు.బుధవారం రోజున వైనాల రాజు తండ్రి వైనాల సాంబయ్య మృతిచెందగా సాంబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంబయ్య కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.సాంబయ్య ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్,మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ మూసుకుల సహేందర్ రెడ్డి గాండ్ల మోహన్,రాజు రెబల్, గడప కృష్ణమూర్తి,మల్యాల తిరుపతి,తీగల రాజయ్య గౌడ్,కటకం రవీందర్,కటకం నారాయణ,సయ్యద్ ఇక్బాల్,లల్లు, తదితరులు పాల్గొన్నారు.మరొక కార్యక్రమంలో అలాగే పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి,ఏసిపి మడత రమేష్,సీఐ నక్క ప్రసాద్,ఎస్సై కొట్టే ప్రసాద్ తదితరులు సాంబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.వైనాల రాజుకు, వైనాల వినోద్ కు సానుభూతి వ్యక్తం చేశారు.

## పాతబస్తీలో ఘనంగా దసరా సంబరాలు



**హైదరాబాద్, అక్టోబరు 22 ( డ్రీమ్ టైమ్స్** పాతబస్తీ శాలిబండలోని సుధా టాకీస్ సమీప ఆర్య మైదానంలో సంఘమిత్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో దసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ దసరా చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని అన్నారు. అసోసియేషన్ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ గత 60 ఏళ్లుగా బతుకమ్మ, రావణ దహనం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బతుకమ్మ పోటీల్లో గెలుపొందిన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ సంఘసేవకుడు, టీపీసీసీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి కాశీమోని శ్యామ్ రావు ముదిరాజ్, విద్యుత్ శాఖ ఉద్యోగి జి. వేణుగోపాల్‌లను నీరజ్ సక్సేనా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, మొగల్‌పురా పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయి కుమార్, బీజేపీ సీనియర్ నాయకుడు అర్జున్ ఆర్య, విద్యావేత్త ఎం.ప్రసాద్ రావు, రీతు సక్సేనా, ఏక్తా సక్సేనా పాల్గొన్నారు.

## స్వర్ణకార శంఖారావం భారీ బహిరంగ సభ

-పాంప్లెట్స్ ఆవిష్కరణ






**జోగులాంబ అక్టోబరు 22 ( డ్రీమ్ టైమ్స్ ):** తెలంగాణ జోగులాంబ గద్వాల్ ధరూర్ మండలం లో 24 వ తారీకు జరగబోయే స్వర్ణకార శంఖారావం భారీ బహిరంగ సభకు అందరూ కృషి చేయాలి అని పాంప్లెట్లు ఆవిష్కరించడం అతికించడం జరిగింది భారీ బహిరంగ సభ తేది: 24-10-20 తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం ధరూర్ మండలంలో పోస్టర్లను ఆవిష్కరించి పోస్టర్లను అంటించడం జరిగింది శివ ఆచారి వినోద్ చారి భాస్కర్ చారి రాము చారి

# కార్తికమాసం రద్దీకి పటిష్ట ఏర్పాట్లు చేయాలి





### క్యూ లైన్లు, లడ్డూ ప్రసాదాల కేంద్రాలు, అన్నప్రసాద వితరణపై ఈఓ పరిశీలన

**తేదీ: 22.10.2026 । డ్రీమ్ టైమ్స్ తెలుగు**

**శ్రీశైలం:** రాబోయే కార్తికమాసంలో శ్రీశైల క్షేత్రానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శన క్యూలైన్ల నిర్వహణలో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఆయన సర్వదర్శనం, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం క్యూలైన్లతో పాటు ఆలయ ప్రాంగణంలోని దర్శన క్యూలైన్లు, క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లను పరిశీలించారు. అదేవిధంగా అన్నప్రసాద వితరణ భవన సముదాయం, లడ్డూ ప్రసాదాల విక్రయ కేంద్రాల్లోని క్యూలైన్లను తనిఖీ చేశారు. ముఖ్యంగా క్యూలైన్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అమరికను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ, కార్తికమాసంలో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున కమాండ్ కంట్రోల్ రూము ద్వారా క్యూలైన్ల పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రద్దీకి అనుగుణంగా సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ క్యూలైన్ల నిర్వహణను పర్యవేక్షించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తొక్కిసలాటకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

**సాధారణ భక్తులకు ప్రాధాన్యత**

సర్వదర్శనం క్యూలైన్లలోని సాధారణ భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఈఓ సూచించారు. ముఖ్యంగా వారాంతపు సెలవులు, పర్వదినాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. దర్శన వేళలు, దర్శనానికి పట్టే సమయం తదితర వివరాలను ఆలయ ప్రసార వ్యవస్థ ద్వారా ఎప్పటికప్పుడు భక్తులకు తెలియజేయాలన్నారు. క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతరాయంగా మంచినీరు, అల్పాహారం అందించాలని సూచించారు. క్యూ లైన్లు, క్యూ కాంప్లెక్స్ కంపార్టుమెంట్లలో లైట్లు, ఫ్యాన్లు సక్రమంగా పనిచేసేలా చూడాలని, విద్యుత్ వైరింగ్‌లో అవసరమైన మరమ్మతులు ఎప్పటికప్పుడు చేపట్టాలని ఆదేశించారు. క్యూలైన్లలోని ఫ్లోరింగ్‌ను పరిశీలించి, అవసరమైన చోట వెంటనే మరమ్మతులు, ప్యాచ్‌వర్క్‌లు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.

**లడ్డూ ప్రసాదాల విక్రయాలకు అదనపు ఏర్పాట్లు**

అనంతరం లడ్డూ ప్రసాదాల విక్రయ కేంద్రాలను పరిశీలించిన ఈఓ, భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా ప్రసాదాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్తికమాసంలో భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు లడ్డూ ప్రసాదాల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, మహిళల కోసం ప్రత్యేక కౌంటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

**భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద వితరణ**

తదుపరి అన్నప్రసాద వితరణ భవనాన్ని పరిశీలించిన ఈఓ, కార్తికమాసంలో భక్తుల సంఖ్యకు అనుగుణంగా అన్నప్రసాద వితరణ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతిరోజూ ఎలాంటి జాప్యం లేకుండా అన్నప్రసాద వితరణ ప్రారంభించాలని, భక్తుల రద్దీని బట్టి మధ్యాహ్నం 3.30 గంటల వరకు వితరణ కొనసాగించాలని సూచించారు. అదేవిధంగా రాత్రి వేళల్లోనూ భక్తులకు సౌకర్యంగా ఉండేలా రాత్రి 7 గంటల నుంచే అల్పాహార వితరణ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చిట్వేలులో రసవత్తర రాజకీయం!





- అట్టహాసంగా నామినేషన్ల ఘట్టం..
- ఎంపీపీ రేసులో డాక్టర్ కస్తూరి వరలక్ష్మి
- రెండో రోజు 37 నామినేషన్లు..
- కార్యాలయం వద్ద జనసేన నేతల హడావుడి
- వైకాపా అభ్యర్థుల నామినేషన్ల అడ్డగింతలపై విమర్శలు

**చిట్వేలి, అక్టోబరు 22 ( డ్రీమ్ టైమ్స్ ):** తిరుపతి జిల్లా చిట్వేలి మండలంలో ఎంపీటీసీ నామినేషన్ల ఘట్టం రాజకీయ వేడిని పెంచుతోంది. మండల రాజకీయం బహు రసవత్తరంగా మారింది. మండల పరిషత్ అధ్యక్ష పీఠాన్ని దక్కించుకునే దిశగా కూటమి నాయకులు తమ వ్యూహాలకు పదును పెడుతుండగా, వైకాపా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే క్రమంలో అడ్డంకులు ఎదుర్కొన్నారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. రెండో రోజు నామినేషన్ల ప్రక్రియలో జనసేన నాయకులు చురుగ్గా వ్యవహరించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మరోవైపు కూటమి తరపున ఎంపీపీ పీఠానికి డాక్టర్ కస్తూరి వరలక్ష్మి పేరు తెరపైకి రావడంతో చిట్వేలు మండల రాజకీయాల్లో కొత్త సమీకరణాలపై ఆసక్తి నెలకొంది.

**ఎంపీపీ రేసులో కస్తూరి వరలక్ష్మి**

మండల పరిషత్ అధ్యక్షురాలిగా డాక్టర్ కస్తూరి వరలక్ష్మి రేసులో నిలుస్తోంది. ఆ పీఠం అధిరోహించే అవకాశం దక్కవచ్చున్న ప్రచారం సాగుతోంది. టిడిపి రాష్ట్ర నాయకులు రైల్వేకోడూరు మాజీ టిడిపి ఇన్చార్జ్ కస్తూరి విశ్వనాథం నాయుడు సతీమణి అయిన ఆమె నగిరిపాడు ఎంపీటీసీ అభ్యర్థిగా బుధవారం చిట్వేలి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఎన్నికల అధికారి జయభరత్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆమె పేరు ఎంపీపీ పదవికి సంబంధించి ప్రచారంలోకి రావడంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఈ నామినేషన్ దాఖలు కార్యక్రమంలో రైల్వే కోడూరు నియోజకవర్గ టిడిపి మాజీ అధ్యక్షులు టిడిపి రాష్ట్ర నాయకులు కస్తూరి విశ్వనాథ నాయుడు, రాష్ట్ర ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి, టిడిపి సాంస్కృతిక విభాగపు రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వర నాయుడు, టిడిపి చిట్వేలి మండల అధ్యక్షులు కాకర్ల నాగార్జున తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.



**రెండో రోజు 37 నామినేషన్లు**

చిట్వేలి మండలంలో బుధవారం ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 37 నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు ఇతరులు కూడా నామినేషన్లు సమర్పించడంతో ఎన్నికల సందడి ఊపందుకుంది. ఎన్నికల అధికారి జయభరత్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం తెలుగుదేశం పార్టీ తరఫున 14, జనసేన నుంచి 8, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 9, భారతీయ జనతా పార్టీ నుంచి 3 నామినేషన్లు దాఖలయ్యాయి. భారత చైతన్య యువజన పార్టీ తరఫున ఒకరు, ఇతరులుగా మరో ఇద్దరు నామినేషన్లు సమర్పించారు. దీంతో మొత్తం నామినేషన్ల సంఖ్య 37కు చేరింది.

**జనసేన నేతల హడావుడి.. వైకాపా నామినేషన్లపై వివాదం**

రెండు రోజులుగా సాగుతున్న నామినేషన్ల ప్రక్రియలో రాజకీయ పార్టీల మధ్య ఆధిపత్య పోరు స్పష్టంగా కనిపిస్తోంది. వైకాపా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో కూటమి నాయకులు అడ్డుకున్నారని, కొన్ని సందర్భాల్లో నామినేషన్ పత్రాలను చించివేసే ప్రయత్నాలు జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండో రోజు ముఖ్యంగా జనసేన నాయకులు చురుగ్గా వ్యవహరించి తమ ఉనికిని చాటుకున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వైకాపా అభ్యర్థుల నామినేషన్లకు ఆటంకాలు కల్పించే విషయంలో జనసేన నాయకులు ముందున్నారన్న విమర్శలు కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

**టీడీపీ వ్యూహాత్మక మౌనం?**

నామినేషన్ల పర్వంలో జనసేన నాయకులు బహిరంగంగా చురుకైన పాత్ర పోషిస్తుండగా, టీడీపీ నాయకులు తమ రాజకీయ వ్యూహాలను నిశ్శబ్దంగా అమలు చేస్తున్నారన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. టీడీపీకి చెందిన రాష్ట్రస్థాయి నాయకులు సైతం చిట్వేలు ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియలో పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. కూటమిలోని రెండు పార్టీల నాయకుల కదలికలు, అభ్యర్థుల ఎంపిక, స్థానిక రాజకీయ సమీకరణాలు రానున్న రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

**పోలీసుల బందోబస్తు..**

నామినేషన్ల కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చిట్వేలు ఎస్ఐ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యాలయం చుట్టూ వంద మీటర్ల పరిధిలో భద్రతా చర్యలు చేపట్టి అభ్యర్థులు, వారి అనుచరుల రాకపోకలను పర్యవేక్షించారు. అయినప్పటికీ నామినేషన్ల అడ్డగింతలపై ఆరోపణలు రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించాయి.

మొత్తంగా చిట్వేలి మండలంలో ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ కేవలం అభ్యర్థుల పోటీగానే కాకుండా, ఎంపీపీ పీఠాన్ని దక్కించుకునే రాజకీయ వ్యూహాలకు వేదికగా మారుతోంది. డాక్టర్ కస్తూరి వరలక్ష్మి పేరు ప్రచారంలోకి రావడం, జనసేన నాయకుల చురుకైన పాత్ర, వైకాపా అభ్యర్థుల నామినేషన్లపై వివాదాలు మండల రాజకీయాలను మరింత రసవత్తరంగా మార్చాయి. నామినేషన్ల చివరి రోజు పరిస్థితులు ఎలా ఉంటాయి? కూటమి వ్యూహాలు ఏ రూపం దాలుస్తాయి? వైకాపా అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేయగలరా? అన్న ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి.

# బిజినెస్

## పల్సర్ ఎన్250 ఎస్ఎస్ మాడల్

**ధర రూ.1,59,406**



**ముంబై,**
పల్సర్ విభాగంలో మరో మాడల్‌ను తీసుకొచ్చింది బజాజ్ ఆటో. దేశవ్యాప్తంగా ప్రీమియం బైకులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని పల్సర్ ఎన్250ఎస్ఎస్ మాడల్‌ను విడుదల చేసింది. ఈ బైకు ధర రూ.1,59,406గా నిర్ణయించింది. ఈ ధరలు న్యూఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. 4వీ ఇంజిన్, టీఎఫ్‌టీ గూగుల్ మ్యాప్ మిర్రరింగ్ కలిగిన ఐదు ఇంచుల టీఎఫ్‌టీ, యూఎస్‌బీ టైప్-సీ పోర్ట్, ప్యానిక్ బ్రేక్ అలర్ట్, ఆరు స్పీడ్ గేర్లు ఉన్నాయని కంపెనీ ఉన్నతాధికారి సారంగ్ తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో తయారు చేసిన ఈ బైకు యువతకు నచ్చుతుందన్నారు.

## విపణిలోకి కొత్త ఆడీ క్యూ3.. ధర రూ.51.99 లక్షలు

- -దేశీయ మార్కెట్లో సరికొత్త లగ్జరీ ఎస్‌యూవీ విడుదల
- -దేశంలోనే తయారైన కొత్త మోడల్‌ను అందుబాటులోకి తెచ్చిన ఆడీ
- -2.0 లీటర్ల టీఎఫ్ఎస్ఐ పెట్రోల్ ఇంజిన్‌తో రూపకల్పన
- -కేవలం 7.1 సెకన్లలో 100 కి.మీ. వేగాన్ని అందుకునే సామర్థ్యం
- -30.22 సెంటీమీటర్ల వర్చువల్ కాక్‌పిట్ ప్రత్యేక ఆకర్షణ
- -32.51 సెంటీమీటర్ల ఎంఎంఐ టచ్ డిస్‌ప్లే, సోనోస్ ప్రీమియం సౌండ్ సిస్టమ్
- -తొమ్మిది ఎయిర్‌బ్యాగ్‌లు, అధునాతన డ్రైవర్ సహాయక వ్యవస్థలు
- -మైక్రో ఎల్ఈడీ సాంకేతికత, 15 ఏళ్ల వారంటీతో కొత్త మోడల్




ముంబై,
జర్మనీకి చెందిన ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ దేశీయ మార్కెట్లోకి సరికొత్త క్యూ3 మోడల్‌ను విడుదల చేసింది. దేశంలోనే తయారైన ఈ లగ్జరీ ఎస్‌యూవీ ప్రారంభ ధరను రూ.51.99 లక్షలుగా నిర్ణయించింది. ఆకర్షణీయమైన రూపకల్పన, శక్తిమంతమైన ఇంజిన్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, భద్రతా సదుపాయాలతో కొత్త క్యూ3ను రూపొందించినట్లు కంపెనీ వెల్లడించింది. కొత్త ఆడీ క్యూ3లో 2.0 లీటర్ల టీఎఫ్ఎస్ఐ పెట్రోల్ ఇంజిన్‌ను అమర్చారు. ఈ కారు కేవలం 7.1 సెకన్లలోనే గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదని సంస్థ తెలిపింది. పనితీరుతోపాటు ప్రయాణంలో సౌకర్యం, వినియోగదారులకు మెరుగైన డ్రైవింగ్ అనుభూతిని అందించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొంది. కారు లోపలి భాగంలో ఆధునిక డిజిటల్ సదుపాయాలను అందించారు. 30.22 సెంటీమీటర్ల ఆడీ వర్చువల్ కాక్‌పిట్, 32.51 సెంటీమీటర్ల ఎంఎంఐ టచ్ డిస్‌ప్లే ఇందులో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. వీటితోపాటు సోనోస్ ప్రీమియం సౌండ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రయాణ సమయంలో వినోదాన్ని మరింత మెరుగుపరిచేలా ఈ సదుపాయాలను పొందుపరిచినట్లు కంపెనీ తెలిపింది. భద్రతకు కూడా ప్రాధాన్యమిస్తూ కొత్త క్యూ3లో తొమ్మిది ఎయిర్‌బ్యాగ్‌లు, అధునాతన డ్రైవర్ సహాయక వ్యవస్థలను అందించారు. మైక్రో ఎల్ఈడీ సాంకేతికతను ఉపయోగించి కారును తీర్చిదిద్దినట్లు సంస్థ వెల్లడించింది. ఈ మోడల్‌పై 15 ఏళ్ల వారంటీని అందిస్తున్నట్లు తెలిపింది. కొత్త క్యూ3 విడుదలతో దేశీయ లగ్జరీ ఎస్‌యూవీ విభాగంలో తన ఉనికిని మరింత బలోపేతం చేసుకోవాలని ఆడీ లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త మోడల్ ధర, ఇంజిన్ పనితీరు, సాంకేతిక సదుపాయాలు వినియోగదారులను ఆకర్షిస్తాయని కంపెనీ బ్రాండ్ డైరెక్టర్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు.

## మూడోరోజూ నష్టాల్లో సూచీలు

- -వరుసగా మూడో సెషన్‌లోనూ దేశీయ మార్కెట్ల పతనం
- -సెన్సెక్స్ 460.30 పాయింట్లు డౌన్
- -73,249.39 వద్ద ముగిసిన సెన్సెక్స్
- -నిఫ్టీ 123.70 పాయింట్లు పతనం
- -22,687.65 వద్ద స్థిరపడిన నిఫ్టీ
- -రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్ షేర్లలో నష్టాలు
- -ఐటీసీ, టీసీఎస్, ఎల్అండ్‌టీ షేర్లకూ నష్టాలు
- -ఎన్ఎస్ఈలో లిస్టయిన హైదరాబాద్‌కు చెందిన ఐఐఆర్ఎం హోల్డింగ్స్



**ముంబై, అక్టోబర్ 22:**
దేశీయ స్టాక్ మార్కెట్లలో నష్టాల పరంపర కొనసాగుతోంది. వరుసగా మూడోరోజూ గురువారం సూచీలు నష్టాలతో ముగిశాయి. 30 షేర్ల సెన్సెక్స్ 460.30 పాయింట్లు కోల్పోయి 73,249.39 వద్ద స్థిరపడింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ కూడా 123.70 పాయింట్లు తగ్గి 22,687.65 వద్ద ముగిసింది. మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడితో పలు ప్రముఖ కంపెనీల షేర్లు నష్టాలను చవిచూశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎటర్నల్, హెచ్‌డీఎఫ్‌సీ, పవర్‌గ్రిడ్, ట్రెంట్, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్ షేర్లు దిగజారాయి. ఐటీసీ, భారత్ ఎలక్ట్రానిక్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, ఎల్అండ్‌టీ షేర్లలోనూ నష్టాలు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా, హైదరాబాద్‌కు చెందిన ఐఐఆర్ఎం హోల్డింగ్స్ గురువారం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లో లిస్టయింది.

# స్పోర్ట్స్

## ఆర్చరీలో శీతల్ దేవి స్వర్ణ సంచలనం

- -ఆసియా పారా గేమ్స్‌లో భారత ఆర్చర్‌కు రెండో బంగారు పతకం
- -మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలోనూ విజయం
- -ఫైనల్లో సింగపూర్ అథ్లెట్ ఆలిమ్ నుర్ స్యాహిదాపై గెలుపు
- -142-139 స్కోరుతో ప్రత్యర్థిపై ఆధిక్యం
- -కొన్ని గంటల ముందే మిక్స్‌డ్ టీమ్ విభాగంలోనూ స్వర్ణం
- -తోమన్ కుమార్‌తో కలిసి టీమ్ ఈవెంట్‌లో అగ్రస్థానం
- -మహిళల డబుల్స్‌లో రజత పతకం కూడా సాధించిన శీతల్
- -ప్రస్తుత పోటీల్లో మొత్తం మూడు పతకాలతో మెరిసిన భారత అథ్లెట్



నగోయా:
చేతులు లేకపోయినా తన అసాధారణ ప్రతిభతో ఆర్చరీలో అద్భుతాలు సృష్టిస్తున్న భారత అథ్లెట్ శీతల్ దేవి ఆసియా పారా గేమ్స్‌లో మరో స్వర్ణ పతకాన్ని సాధించింది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో విజేతగా నిలిచి పసిడి పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో సింగపూర్‌కు చెందిన ఆలిమ్ నుర్ స్యాహిదాను 142-139 స్కోరుతో ఓడించింది. దీంతో ప్రస్తుత పారా గేమ్స్‌లో శీతల్ సాధించిన స్వర్ణ పతకాల సంఖ్య రెండుకు చేరింది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో శీతల్ ఆరంభం నుంచే పట్టుదలతో పోటీపడింది. ఫైనల్లో ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైనా లక్ష్యంపై దృష్టి నిలిపి కీలక దశల్లో మెరుగైన స్కోరు సాధించింది. చివరకు మూడు పాయింట్ల ఆధిక్యంతో విజయం అందుకుంది. ప్రపంచ చాంపియన్‌గా గుర్తింపు పొందిన 19 ఏళ్ల శీతల్ మరోసారి తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ భారత పతకాల ఖాతాకు స్వర్ణాన్ని జోడించింది. వ్యక్తిగత విభాగంలో స్వర్ణం సాధించడానికి కొన్ని గంటల ముందే శీతల్ దేవి మరో బంగారు పతకాన్ని గెలుచుకుంది. తోమన్ కుమార్‌తో కలిసి కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో విజేతగా నిలిచింది. వరుసగా రెండు విభాగాల్లో స్వర్ణాలు సాధించడం ద్వారా ఈ పోటీల్లో తన ఆధిపత్యాన్ని చాటుకుంది. 2023లో హాంగ్‌జౌలో జరిగిన ఆసియా పారా గేమ్స్‌లోనూ శీతల్ దేవి ఇదే ప్రత్యర్థి ఆలిమ్ నుర్ స్యాహిదాపై విజయం సాధించింది. తాజాగా మరోసారి ఆమెను ఓడించి వ్యక్తిగత విభాగంలో స్వర్ణాన్ని దక్కించుకుంది. ప్రత్యర్థిపై వరుస విజయాలు శీతల్ ప్రదర్శనలోని స్థిరత్వాన్ని చాటుతున్నాయి. ప్రస్తుత పారా గేమ్స్‌లో శీతల్ దేవి ఇప్పటివరకు మొత్తం మూడు పతకాలు సాధించింది. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్, మహిళల వ్యక్తిగత విభాగాల్లో స్వర్ణాలు గెలుచుకోగా, మహిళల డబుల్స్‌లో రజత పతకాన్ని అందుకుంది. తన ప్రత్యేకమైన ఆర్చరీ నైపుణ్యం, పట్టుదలతో భారత క్రీడాభిమానుల దృష్టిని ఆకర్షించింది. వరుస పతకాలతో భారత జట్టు పతకాల పట్టికకు ఆమె కీలకంగా నిలిచింది.

## 226 కొట్టేశారు..

న్యూజిలాండ్ గడ్డపై టీమిండియా అదరగొట్టింది. భారీ లక్ష్యాన్ని ఛేదిస్తూ తొలి టీ20లోనే రికార్డు విజయాన్ని అందుకుంది. సంజూ శాంసన్ (33 బంతుల్లో 67; 8 ఫోర్లు, 4 సిక్సర్లు), నమన్ ధీర్ (15 బంతుల్లో 42 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) మెరుపు ఇన్నింగ్స్‌లతో భారత్ ఐదు టీ20ల సిరీస్‌ను విజయంతో ప్రారంభించింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ నిర్దేశించిన 226 పరుగుల లక్ష్యాన్ని ఆరు వికెట్లు కోల్పోయి, మరో రెండు బంతులు మిగిలుండగానే ఛేదించింది. ఈ ఫార్మాట్‌లో భారత్‌కు ఇదే అత్యధిక లక్ష్య ఛేదనగా నిలిచింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (28 బంతుల్లో 42) కూడా కీలక పాత్ర పోషించాడు. శాంసన్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 225 పరుగుల భారీ స్కోరు సాధించింది. గ్లెన్ ఫిలిప్స్ (40 బంతుల్లో 82 నాటౌట్; 8 ఫోర్లు, 3 సిక్సర్లు) భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఫిన్ అలెన్ (24 బంతుల్లో 45) ధాటిగా ఆడగా, బెవాన్ జాకబ్స్ 31, డారిల్ మిచెల్ 28, సిఫర్ట్ 24 పరుగులతో రాణించారు. నాలుగేళ్ల విరామం తర్వాత బరిలోకి దిగిన భువనేశ్వర్ కుమార్ వికెట్ తీయకుండా 49 పరుగులు ఇచ్చాడు.




అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ పడగొట్టారు. భారీ లక్ష్య ఛేదనలో భారత ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ (29) మెరుపు ఆరంభాన్ని అందించారు. అభిషేక్ తొలి బంతికే సిక్సర్ బాదగా, శాంసన్ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. రెండో ఓవర్‌లో ఫెర్గూసన్ బౌలింగ్‌లో శాంసన్ ఫోర్, సిక్స్, ఫోర్ బాదాడు. మిల్నే వేసిన ఓవర్‌లో అభిషేక్ వరుస బౌండరీలతో చెలరేగాడు. బ్రేస్‌వెల్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్ కొట్టిన శాంసన్ కేవలం 23 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. అయితే, అదే ఓవర్‌లో అభిషేక్ క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ ఒక వికెట్‌కు 94 పరుగులు చేసింది. ఆ తర్వాత న్యూజిలాండ్ స్పిన్నర్లు బ్రేస్‌వెల్, శాంట్నర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి భారత్‌ను ఇబ్బందుల్లోకి నెట్టారు. శాంట్నర్ వరుస ఓవర్లలో శాంసన్, ఇషాన్ (1)ను ఔట్ చేయగా, బ్రేస్‌వెల్ బౌలింగ్‌లో తిలక్ వర్మ (6) వెనుదిరిగాడు. దీంతో భారత్ 122 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. ఈ దశలో అక్షర్ పటేల్ (24), శ్రేయస్ అయ్యర్ జట్టును ఆదుకున్నారు. హెన్రీ బౌలింగ్‌లో అయ్యర్ రెండు సిక్సర్లు బాది భారత్‌ను మళ్లీ పోటీలోకి తెచ్చాడు. అయితే, ఫెర్గూసన్ బౌలింగ్‌లో అక్షర్ ఔటవడంతో మ్యాచ్ మళ్లీ ఉత్కంఠగా మారింది. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన నమన్ ధీర్ ఒత్తిడిని లెక్కచేయకుండా దూకుడుగా ఆడాడు. శాంట్నర్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్ బాదిన అతను, నేథన్ స్మిత్ ఓవర్‌లోనూ బౌండరీలతో జోరు పెంచాడు. ఫెర్గూసన్ క్యాచ్ వదిలేయడంతో 24 పరుగుల వద్ద నమన్‌కు మరో అవకాశం లభించింది. చివరి 12 బంతుల్లో 16 పరుగులు కావాల్సిన వేళ, 19వ ఓవర్ తొలి బంతికే అయ్యర్ ఔటయ్యాడు. అయినప్పటికీ నమన్ ఏమాత్రం వెనకడుగు వేయకుండా రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో లక్ష్యాన్ని పూర్తి చేశాడు. దీంతో భారత్ నాలుగు వికెట్ల తేడాతో విజయాన్ని సొంతం చేసుకుంది. రెండో టీ20 శనివారం ఇదే వేదికపై జరగనుంది.

## బ్రూక్ రికార్డు డబుల్

**అయినా ఇంగ్లండ్‌కు తప్పని ఓటమి**




**రావల్పిండి**
కెప్టెన్ హ్యారీ బ్రూక్ (202) వన్డేల్లో ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీతో పాటు ఈ ఫార్మాట్‌లో ద్విశతకం కొట్టిన ఇంగ్లండ్ తొలి ఆటగాడిగా రికార్డు సృష్టించినా తన జట్టును గెలిపించలేకపోయాడు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 2 వికెట్ల తేడాతో ఇంగ్లిష్ టీమ్‌ను ఓడించి ఔరా అనిపించింది. 430 పరుగుల లక్ష్యాన్ని 8 వికెట్లు కోల్పోయి మరో బంతి మిగిలుండగానే అందుకొని వన్డేల్లో రెండో అత్యధిక ఛేదనతో రికార్డుకెక్కింది. పవన్ రత్నాయకే (130), అవిష్క (97), షనక (97)తో పాటు చివర్లో లియానగే (27 బంతుల్లో 61 నాటౌట్) మెరుపు బ్యాటింగ్‌తో లంకను గెలిపించారు. తొలుత ఇంగ్లండ్ 50 ఓవర్లలో 429/4 స్కోరు చేసింది. 114 బంతుల్లో ద్విశతకానికి చేరిన బ్రూక్ గత నెల వెస్టిండీస్‌పై భారత సారథి శుభ్‌మన్ గిల్ 117 బంతుల్లో నెలకొల్పిన ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ రికార్డును బ్రేక్ చేశాడు.

# కీర్తి సురేష్ 'అక్క' ట్రైలర్ అదుర్స్!

## స్త్రీల రాజ్యమేలుతున్న పెన్నురు గడ్డపై పవర్ వార్..



ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ తెరకెక్కించిన క్రైమ్ డ్రామా సిరీస్ 'అక్క' ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. నేషనల్ అవార్డు గ్రహీత కీర్తి సురేష్, టాలెంటెడ్ నటి రాధికా ఆప్టే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సిరీస్‌పై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. వైఆర్‌ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన ఈ సిరీస్‌కు ధర్మరాజ్ శెట్టి రచన, దర్శకత్వం వహించారు. పూర్తిగా మహిళల చేతుల్లో సాగే ఒక విభిన్న రాజ్యాన్ని, వారి మధ్య జరిగే పవర్ పాలిటిక్స్‌ను ఈ సిరీస్‌లో ఆవిష్కరించనున్నారు. అక్టోబర్ 30 నుంచి ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.ట్రైలర్ చూస్తుంటే.. పెన్నురు అనే కల్పిత రాజ్యంలో గత 800 ఏళ్లుగా కేవలం మహిళలదే పూర్తి ఆధిపత్యం. ఇక్కడ కుటుంబాలు, వ్యాపారాలు అన్నీ మహిళల కంట్రోల్‌లోనే ఉంటాయి. కుటుంబంలో అత్యున్నత అధికారం చెలాయించే మహిళను 'అక్క' అని పిలుస్తారు. ప్రేమకు, పెళ్లికి సంబంధించి ఈ సమాజం కొన్ని ప్రత్యేకమైన నిబంధనలను పాటిస్తుంది. అయితే, రుద్ర (రాధికా ఆప్టే) రాకతో ఈ వ్యవస్థలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుంటాయి. రుద్ర అంచనాలు, ఆమె ఆశయాలు భవాని (కీర్తి సురేష్)తో తీవ్ర ఘర్షణకు దారితీస్తాయి. ఈ ఇద్దరు బలమైన మహిళల మధ్య జరిగే ఆధిపత్య పోరు, వంశాచారాన్ని కాపాడుకునే ప్రయత్నం వంటి అంశాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది.ఈ చిత్రంలో తన్వి అజ్మి, మహేష్ మంజ్రేకర్, అన్షుమన్ పుష్కర్, మోనికా పన్వార్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నెట్‌ఫ్లిక్స్, వైఆర్‌ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ క్రైమ్ డ్రామా అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.




# 'రామాయణ'ను 3డీలోనే చూడండి..

## ప్రేక్షకులకు సాయిపల్లవి ప్రత్యేక విజ్ఞప్తి!




భారతీయ ఇతిహాస గాథ రామాయణాన్ని వెండితెరపై అత్యంత భారీ స్థాయిలో ఆవిష్కరించేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది. బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, యశ్ రావణుడిగా నటిస్తున్న ఈ పౌరాణిక చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రముఖ నిర్మాత నమిత్ మల్హోత్రా నిర్మాణంలో, నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 2026 నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా తమిళ ప్రీ-రిలీజ్ కార్యక్రమంలో పాల్గొన్న సాయిపల్లవి.. ఈ సినిమాను థియేటర్లలో త్రీడీ రూపంలోనే చూడాలని ప్రేక్షకులకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.'రామాయణ'లో సీత పాత్ర పోషిస్తున్న సాయిపల్లవి సినిమా విజువల్స్ గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను మొబైల్ ఫోన్‌లో చూడటానికి, పెద్ద తెరపై త్రీడీలో వీక్షించడానికి చాలా తేడా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. మొబైల్‌లో చూసినప్పుడు కలిగే అనుభూతి కంటే, థియేటర్లో త్రీడీ రూపంలో చూస్తే మరింత గొప్ప అనుభవం లభిస్తుందని తెలిపారు.అందుకే ప్రేక్షకులు ఈ చిత్రాన్ని థియేటర్లలోనే చూడాలని, ముఖ్యంగా త్రీడీ ప్రదర్శనను ఎంచుకోవాలని ఆమె కోరారు. రామాయణం వంటి గొప్ప ఇతిహాసాన్ని భారీ దృశ్యాలతో వెండితెరపై చూపించేందుకు చిత్రబృందం కృషి చేస్తోందని ఆమె మాటలను బట్టి అర్థమవుతోంది. నిర్మాత నమిత్ మల్హోత్రా ఈ చిత్రాన్ని రూపొందించడంలో పెట్టుకున్న లక్ష్యం గురించి కూడా సాయిపల్లవి మాట్లాడారు. రామాయణం వంటి ప్రపంచ ప్రసిద్ధ ఇతిహాసాన్ని సాధారణ స్థాయిలో తెరకెక్కించడం ఆయనకు ఇష్టం లేదని వెల్లడించారు. ఈ కథకు తగిన గొప్పదనం, స్థాయి తెరపై కనిపించాలన్నదే ఆయన ఉద్దేశమని వివరించారు.రామాయణం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలతో ముడిపడిన ఇతిహాసం. అలాంటి కథను ప్రపంచ ప్రేక్షకులకు చేరువ చేయాలంటే కథనం, నటీనటుల అభినయం, దృశ్యరూపకల్పన వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఈ నేపథ్యంలోనే చిత్రాన్ని భారీ నిర్మాణ విలువలతో రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.ఈ సినిమా కోసం చిత్రబృందం అందించిన పనితీరుపై తాము గర్వంగా ఉన్నామని సాయిపల్లవి పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత గొప్ప కథల్లో ఒకటైన రామాయణానికి న్యాయం చేసేలా సినిమాను రూపొందించామని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ చిత్రాన్ని కుటుంబ సభ్యులతో కలిసి థియేటర్లలో వీక్షించాలని సాయిపల్లవి ప్రేక్షకులను కోరారు. ముఖ్యంగా పిల్లలను వెంట తీసుకెళ్లి త్రీడీలో సినిమా చూడాలని సూచించారు. రామాయణం కథలోని విలువలు, పాత్రలు, భావోద్వేగాలను పెద్ద తెరపై అనుభవించే అవకాశం పిల్లలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని ఆమె పిలుపు ఇచ్చారు.ఇదిలా ఉండగా, భారత్‌లో నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాల్లో ఇదే చివరిదని సాయిపల్లవి తెలిపారు. ఇకపై చిత్రబృందం విదేశాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దీంతో సినిమా విడుదలకు ముందు అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రచారాన్ని విస్తరించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# పెళ్లిపీటలు ఎక్కబోతున్న 'హనుమాన్' హీరో తేజ సజ్జ..

## ఉదయ్‌పూర్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్!



టాలీవుడ్ యంగ్ హీరో, 'హనుమాన్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న తేజ సజ్జ త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. ఈ వార్తను స్వయంగా ఆయనే ధృవీకరించారు. తన పెళ్లికి సంబంధించిన ఆసక్తికర విషయాలను అభిమానులతో పంచుకున్నారు. రాజస్థాన్‌లోని చారిత్రాత్మక నగరమైన ఉదయ్‌పూర్‌లో ఈ ఏడాది డిసెంబర్‌లో తన వివాహం అత్యంత నిరాడంబరంగా జరగనుందని తేజ సజ్జ వెల్లడించారు.ఈ వివాహం పూర్తిగా పెద్దలు కుదిర్చిన వివాహం అని తేజ స్పష్టం చేశారు. తన తల్లిదండ్రులే ఈ సంబంధం నిశ్చయించారని తెలిపారు. డిసెంబర్‌లో జరగబోయే పెళ్లి వేడుకకు ముందు, నవంబర్ నెలలో నిశ్చితార్థ వేడుకను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తన వ్యక్తిగత జీవితాన్ని ఎప్పుడూ మీడియా కంటికి దూరంగా, అత్యంత గోప్యంగా ఉంచాలని కోరుకునే తేజ సజ్జ.. ఈ పెళ్లి వేడుకను కూడా కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలోనే జరపాలని నిర్ణయించుకున్నారు. ఉదయ్‌పూర్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్ ముగిసిన తర్వాత, హైదరాబాద్‌లో టాలీవుడ్ ప్రముఖులు, స్నేహితుల కోసం ప్రత్యేకంగా ఒక ఘనమైన రిసెప్షన్ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇక తన కాబోయే భార్య గురించి చెబుతూ.. ఆమెకు సినీ పరిశ్రమతో ఎలాంటి సంబంధం లేదని తేజ వెల్లడించారు. ఆమె కుటుంబం టెక్నాలజీ రంగంలో వ్యాపారం చేస్తోందని, ఆమె కూడా తన తండ్రితో కలిసి అదే రంగంలో పనిచేస్తున్నారని చెప్పారు. ఆమె అమెరికాలో పెరిగారని, సినిమా గ్లామర్ ప్రపంచానికి, లైమ్‌లైట్‌కు పూర్తిగా దూరంగా ఉన్నారని తెలిపారు. సెలబ్రిటీ ప్రపంచానికి దూరంగా ఉండే ఆమె స్వభావమే తనకు బాగా నచ్చిందని, భవిష్యత్తులో కూడా ఆమె ప్రైవసీకి ఎటువంటి భంగం కలగకుండా చూసుకుంటానని తేజ సజ్జ పేర్కొన్నారు. ప్రొఫెషనల్ లైఫ్ విషయానికి వస్తే.. 'హనుమాన్' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న తేజ సజ్జ, ఆ తర్వాత 'మిరాయ్' చిత్రంతో బ్లాక్ బస్టర్ అందుకున్నారు. ప్రస్తుతం ఆయన అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతున్న ప్రముఖ రియాలిటీ షో 'ది ట్రైటర్స్ తెలుగు' తొలి సీజన్‌కు హోస్ట్ వ్యవహరిస్తూ బిజీగా ఉన్నారు.

# రామ్‌చరణ్‌కు జోడీగా

'సైయారా' సినిమాతో దేశవ్యాప్తంగా యువతలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది బాలీవుడ్ భామ అనీత్ పడ్డా. చూడముచ్చటైన అందం, అభినయం కలబోతగా ఆమె నటన అందరిని ఆకట్టుకుంది. తాజాగా ఈ భామ తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేయబోతున్నట్లు వార్తలొస్తున్నాయి. 'రంగస్థలం'తో సంచలనం సృష్టించిన అగ్ర హీరో రామ్‌చరణ్- క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే.ఈ సినిమాలో కథానాయికగా పలువురు బాలీవుడ్ భామల పేర్లు తెరపైకొస్తున్నాయి. తొలుత 'ధురంధర్' ఫేమ్ సారా అర్జున్ ఈ సినిమాలో నటిస్తుందని వార్తలొచ్చాయి. తాజాగా యువ నాయిక అనీత్ పడ్డా పేరు తెరపైకి వచ్చింది. ఈ ఇద్దరు బాలీవుడ్ భామల్లో..దర్శకుడు సుకుమార్ ఎవరిని కథానాయికగా ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ చిత్రం ఈ నెలలోనే లాంఛనంగా ప్రారంభం కానున్నట్లు సమాచారం.



# 'వారణాసి' కథలో అదే కీలకం!



'వారణాసి' కేవలం భారీ యాక్షన్, సాహసాలతో కూడిన సినిమా కాదని, విడిపోయిన తండ్రీకొడుకుల బంధం చుట్టూ అల్లుకున్న ఓ భావోద్వేగ ప్రయాణం ఈ కథలో కీలకంగా ఉంటుందని చెప్పారు చిత్ర దర్శకుడు రాజమౌళి. సినిమా షూటింగ్ ఇంకా పది రోజులు మాత్రమే మిగిలి ఉందని ఆయన వెల్లడించారు. మహేష్‌బాబు కథానాయకుడిగా రూపొందిస్తున్న 'వారణాసి' చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈ నేపథ్యంలో ఇటీవల బ్రెజిల్‌లో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి హాజరైన దర్శకుడు రాజమౌళి 'వారణాసి' కథ గురించి ఆసక్తికరమైన విషయాల్ని పంచుకున్నారు.తండ్రీకొడుకుల అనుబంధంతో పాటు అందమైన ప్రేమకథని కూడా ఈ సినిమాలో చూస్తారని తెలిపారు. వారణాసి, అంటార్కిటికా, ఆఫ్రికా నేపథ్యంలో వచ్చే ఘట్టాలు వేటికవే ప్రత్యేకంగా నిలుస్తాయని అన్నారు. 'ఇది సైన్స్ ఫిక్షన్‌లా అనిపించినా..పౌరాణిక అంశాలతో కూడిన ఫాంటసీ చిత్రం. ఆరేడు సినిమాలు ఒకే చిత్రంలో ఇమిడ్చినట్లుగా అనిపిస్తుంది. వాటన్నింటినీ కలుపుతూ భావోద్వేగభరితంగా కథను నడిపించడమే అతి పెద్ద సవాలు' అని రాజమౌళి పేర్కొన్నారు.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831